


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 341, పేజీలు - 08

సోమవారం, జూన్ 1, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## చరిత్ర సృష్టించిన సాత్విక్- చిరాగ్

2లో..



## ఐపీఎల్ 2026 టైటిల్ విన్నర్‌గా ఆర్‌సీబీ

- గుజరాత్‌ని ఓడించి, చరిత్ర సృష్టించిన ఆర్‌సీబీ

2లో..



# గ్రేటర్‌పై గురి

▶ రేవంత్ రెడ్డి రోడ్డు మ్యాప్ రెడీ చేశారా? ▶ హైదరాబాద్ వాసులకు వరాలు ప్రకటించనున్నారా?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో ఈసారి అత్యధిక స్థానాలను సాధించి మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని ఎన్నికలకు ముందు నుంచే అన్నీ సిద్ధం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక నుంచి వార్డుల వారీగా కీలక నేతలతో ఆయన సమావేశమవుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో వన్ సైడ్ విజయం సాధించి తమ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్న వారి నోటికి తాళం వేయాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్డు మ్యాప్ ను కూడా సిద్ధం చేస్తున్నారు.




### గత ఎన్నికల్లో చేదు అనుభవం..

2021లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చేదు అనుభవం ఎదురయింది. కేవలం ఒక డివిజన్ లో మాత్రమే గెలిచింది. అలాగే 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క స్థానం కూడా దక్కలేదు. అయితే ఆ తర్వాత జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాత్రం విజయం సాధించి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాధాన్యత దక్కేలా చేశారు. ఈసారి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పట్టు సాధించి బీఆర్ఎస్ ను జీరో లెవెల్ చేయాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. హైడ్రా తో హైదరాబాద్ లో ఆక్రమణలు తొలిగించి ఓట్లను మరింతగా రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

2లో..

## వేడిని తగ్గించే సాంప్రదాయ పానీయాలు

- ప్రధాని మోదీ చెప్పిన ఆసక్తికర విషయాలు!

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' 134వ ఎపిసోడ్‌లో దేశవ్యాప్తంగా తీవ్రమైన వేడి మరియు హీట్ వేవ్ పరిస్థితులను ప్రస్తావించి, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన సాంప్రదాయిక భారతీయ పానీయాలను ఉపయోగించి వేడిని తగ్గించుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలోని చాలా ప్రాంతాల్లో తీవ్రమైన వేడి ఉందని, ఎండలు మండుతున్నాయని అన్నారు. మండే ఎండలు, వేడి గాలుల విషయంలో మనం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ నీళ్లు తాగాలి. ఎండలో బయటకు వెళ్లవలసి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను కూడా పాటించాలి అని చెప్పారు.



ఇక భారతీయ వంటగదుల్లోనే వేడిని ఎదుర్కొనే సహజ మార్గాలు ఉన్నాయని తెలిపారు. వేసవి వచ్చేసరికి ఇంట్లో పానీయాలు మారిపోతాయని, మట్టి కుండల నీళ్లు, పెరుగుతో చేసిన మజ్జిగ, కాచిన మామిడి పళ్ల షర్బత్ వంటివి సిద్ధం చేసి సాంప్రదాయిక

2లో..

## హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి

- రేవంత్ రెడ్డికి కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిజంగా దమ్ముంటే, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఛాలెంజ్ చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం జరిగిన సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### 3 గంటల కరెంట్ చాలన్న వ్యక్తి రేవంత్ రెడ్డి

రైతుల మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయనంటూ సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు ముమ్మాటికి అబద్ధాలన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు 3 గంటల కరెంట్ సరిపోతుందని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక 24 గంటల ఉచిత కరెంట్‌ను పూర్తిగా ఎగగొట్టేందుకే రైతు డిస్కం పేరుతో కొత్త కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో, రేవంత్ రెడ్డికి రైతులపై అంతే ప్రేమ ఉందంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### ఉచిత విద్యుత్‌ను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్లాన్

'రైతు డిస్కం' అనేది రైతన్నల మెడకు ఉరితాడు లాంటిదని, దీని ద్వారా ఉచిత విద్యుత్‌ను శాశ్వతంగా రద్దు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు, పారిశ్రామిక సెలవులతో (ఇండస్ట్రియల్ హాలిడేస్) రాష్ట్రం అతలాకుతలం

2లో..

## జెన్ జీ యువత కోసం 'సేనా గళం' కమిటీ

- పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం



అమరావతి (ప్రశ్న న్యూస్) సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ ముఖ్యంగా జెన్ జీ యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపించడమే లక్ష్యంగా 'సేనా గళం' అనే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. సమకాలీన రాజకీయాల్లో రాజ్యాంగానికి కట్టుబడి, అన్ని వర్గాలకు గౌరవం ఇస్తూ, దేశ సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరించేలా ఈ కమిటీ పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. ముల్లును ముల్లుతోనే తీయాలి కాపులు తిడితే కాపులతోనే తిట్టించాలి. రెడ్లు , కమ్మవారు విమర్శిస్తే ఆ సామాజిక వర్గాలతోనే ప్రతి విమర్శ చేయించాలి. షెడ్యూలు కులాల వారు ఆరోపణలు చేస్తే అదే కులాలవారితో

2లో..

## జనం ఛీకొట్టినా జగన్ డ్రామాలు మానడం లేదు

- నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- ఇది వైసీపీ నేతల కుట్ర అని లోకేష్ ఫైర్
- జగన్ తన 'గొడ్డలి పార్టీ' కార్యకర్తలతో అశాంతి సృష్టిస్తున్నారని విమర్శలు
- జగన్ కుట్ర రాజకీయాలు మానడం లేదని ఆగ్రహం

అమరావతి (ప్రశ్న న్యూస్) నంద్యాలలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి (వైఎస్సార్) విగ్రహం ధ్వంసమైన ఘటనపై ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్సీపీ) శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నాయి. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు జమ్ములయ్య వైసీపీ నేతల ముఖ్య అనుచరుడేనని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలిందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వైసీపీ నేతలు ఈ తరహా కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

### జగన్నాటకాలు చూసి జనం ఛీకొడుతున్నారు

గతంలో జరిగిన కొన్ని సంఘటనలను



ప్రస్తావిస్తూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి మరణాన్ని గుండెపోటుగా

2లో..

## నీ ఏడుపే బీజేపీకి శాపం

- ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వైరల్
- బీజేపీ అన్ని అవకాశాలు ఇచ్చిందని వెల్లడి
- ఫ్లెక్సీలపై స్పందించిన బీజేపీ చీఫ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీలో విబేధాలు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా పాత నేతలు, కొత్త నేతల మధ్య గ్యాప్ ఉందంటూ వార్తలు వస్తున్న వేళ తాజాగా

2లో..

## భారత త్రివిధ దళాలకు కొత్త బాస్

- ఇక పాకిస్థాన్‌కు కౌంట్ డౌన్ స్టార్ట్..!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్‌కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాతో ఎప్పుడూ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంది. ఈ క్రమంలో భారత కొత్త చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా జనరల్ ఎన్ ఎస్ రాజా సుబ్రమణి బాధ్యతలు స్వీకరించారు. జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30 న ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి నియమితులయ్యారు. పాకిస్థాన్, చైనా వ్యవహారాలపై రాజా సుబ్రమణికి లోతైన అవగాహన ఉంది. సైన్యంలో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న "మిలిటరీ థియేటరైజేషన్" ప్రణాళిక అమలు, మూడు దళాల మధ్య సమన్వయాన్ని

2లో..

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ చారిత్రాత్మక మైలురాయి

- దశాబ్దాల కల నెరవేరిందన్న సీఎం చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ నేడు అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన

2లో..

## విజయ్‌ని చూశాక.. తెలంగాణలో ధైర్యం వచ్చింది

- తాను స్ట్రాంగ్ లీడర్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నానన్న కవిత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో తెలంగాణ రక్షక సేన (టీఆర్ఎస్) పార్టీ స్థాపించిన కల్వకుంట్ల కవిత అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీదే అధికారం అంటూ ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ స్థాపించిన విజయ్ తొలి ప్రయత్నంలోనే విజయం సాధించినట్లుగానే తెలంగాణలో కూడా టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తొలి ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని తనకు మొదటి నుంచి నమ్మకం ఉందని తేల్చి చెప్పిన కవిత తమిళనాడులో విజయ్ గెలుపుతో ప్రజలకు కూడా నమ్మకం వచ్చిందని పేర్కొన్నారు. కొత్త పార్టీలకు అధికారం

2లో..

## చుక్క రక్తంతో క్యాన్సర్ గుట్టురట్టు

- నిమ్స్ మరో ముందడుగు

- నిమ్స్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్యం
- త్వరలో అందుబాటులోకి లిక్విడ్ బయాప్సీ సేవలు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి క్యాన్సర్ అడ్వాన్స్‌డ్ టెస్టులు

2లో..



ప్రజాప్రశ్న



# గ్రేటర్‌పై గురి

### ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణతో..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్లు కీలకం. హైదరాబాద్ లోని అనేక ప్రాంతాల్లో వాళ్లే విజయంలో కీలక భూమిక పోషిస్తారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో ఈసారి మూడు వందల వార్డులుండనున్నాయి. అందుకోసమే రేవంత్ రెడ్డి జాగ్రత్తగా తన వ్యూహాలను గ్రౌండ్ చేస్తున్నారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం అమీర్ పేట చౌరస్తాలోని మైత్రీవనం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి సెటిలర్ల మనసును కొల్లగొట్టే ప్రయత్నం చేశారు. ఇక హైదరాబాద్ లో వేసవిలోనూ విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరొకవైపు హైదరాబాద్ వాసులకు త్వరలోనే రేవంత్ రెడ్డి వరాలు ప్రకటించే అవకాశముంది.

## వేడిని తగ్గించే సాంప్రదాయ పానీయాలు

పానీయాలు తయారు చేసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ భారతదేశ వైవిధ్యభరిత సంస్కృతిని ప్రస్తావిస్తూ, వివిధ రాష్ట్రాల సాంప్రదాయిక పానీయాలను ఉదాహరణగా చెప్పారు. ఉత్తర భారతదేశంలో ఆమ్ పన్నా (కాచిన మామిడి శరబత్) ప్రసిద్ధి చెందిందని, ఇది వేడిని తగ్గించి శరీరానికి చల్లదనం ఇస్తుందని తెలిపారు. పంజాబ్, హర్యానాలో పెద్ద గ్లాసుల్లో లస్సీ, రాజస్థాన్-గుజరాత్‌లో చాచ్ (మజ్జిగ) రోజువారీ ఆహారంతో పాటు తీసుకుంటారని చెప్పారు. బీహార్, ఝార్ఖండ్, తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో సత్తు శరబత్ శక్తినిస్తూ పొట్టను నింపుతుందని ప్రస్తావించారు. సత్తు షర్బత్ శనగలను వేయించి పొడి చేసిన దానితో తయారు చేస్తారు. అలాగే కొంకణ్, గోవాలో కోకం పండుతో చేసే శరబత్, దక్షిణ భారతదేశంలో పానకం, కొబ్బరి నీళ్ళు, నిమ్మకాయ సోడా వంటివి తాగుతారని చెప్పారు. ఒడిషాలో బేల్ పన్నా వంటి పానీయాలు స్థానిక సంస్కృతి భాగమని వివరించారు. ఈ సాంప్రదాయిక పానీయాలు కేవలం వేడి నుంచి ఉపశమనం మాత్రమే కాకుండా, భారతదేశ వైవిధ్యాన్ని, 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' భావనను ప్రతిబింబిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. వేసవిలో ఈ దేశీయ పానీయాలను ఎక్కువగా ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని దేశవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మరిన్ని అంశాలపై కూడా మాట్లాడారు. వేడి కాలంలో ప్రజలు ఎక్కువ నీళ్లు తాగడం, సూర్యకాంతి నుంచి రక్షణ కోసం సరైన దుస్తులు ధరించడం, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడం వంటి అంశాలపై ఆయన మాట్లాడటం ఆధునికతతో , సాంప్రదాయ అలవాట్లని కూడా గుర్తు చేశారు.

## చరిత్ర సృష్టించిన సాత్విక్- చిరాగ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి చరిత్ర సృష్టించారు. సింగపూర్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న తొలి భారత ద్వయంగా నిలిచారు. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకుని ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్, మహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ జోడీపై విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో సాత్విక్-చిరాగ్ జోడీ 18-21, 21-17, 21-16 తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో సాత్విక్-చిరాగ్ జోడీ రెండేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరపడింది. 2024లో థాయ్‌లాండ్ ఓపెన్ గెలిచిన తర్వాత, ఈ జంట ఏకంగా నాలుగు ఫైనల్స్‌లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ గెలుపు వారి కెరీర్‌లో తొమ్మిదో వరల్డ్ టూర్ టైటిల్ కాగా, మూడో సూపర్ 750 టైటిల్ కావడం విశేషం. ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ అయిన సాత్విక్-చిరాగ్, ప్రపంచ మూడో ర్యాంక్ ఇండోనేషియా ద్వయంతో జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలో తడబడింది. తొలి గేమ్‌ను కోల్పోవడంతో ఒత్తిడి పెరిగింది. అయితే, రెండో గేమ్ నుంచి భారత జోడీ పూర్తిగా పుంజుకుంది. తమదైన దూకుడైన ఆటతీరు, పదునైన స్మాష్‌లతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేయడమే కాకుండా, నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి చారిత్రక విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. విజయం ఖరారైన వెంటనే సాత్విక్, చిరాగ్ ఆనందంతో కోర్టుపైనే పడిపోయి భావోద్వేగంతో సంబరాలు చేసుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత టైటిల్ గెలిచిన ఆనందాన్ని ఆస్వాదిస్తూ కోర్టులో నృత్యం చేశారు. ఈ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ ఛాంపియన్లను ఓడించి ఫైనల్‌కు చేరిన ఈ జంట, తుది పోరులోనూ అద్భుత ప్రదర్శనతో అభిమానులను అలరించింది.

## ఐపీఎల్ 2026 టైటిల్ విన్నర్‌గా ఆర్సీబీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఐపీఎల్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత గత సీజన్‌లో తొలి టైటిల్ అందుకున్న ఆర్సీబీ వరుసగా రెండోసీజన్‌లోనూ ట్రోఫీ ముద్దాడింది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగి ఎటాకింగ్ ఛాంపియన్‌లా ఆడి టైటిల్ సాధించింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచులో గెలుపొంది ఈ ఫీట్ సాధించింది. 5 వికెట్ల తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే గుజరాత్ టైటాన్స్ ప్రధాన బలమైన టాప్-3 బ్యాటర్లు ఈ మ్యాచులో విఫలమయ్యారు. వీరంతా స్వల్ప స్కోరు చేసి పెవిలియన్ చేరిపోయారు. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీ చేయడంతో గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 155/8 రన్స్ చేసింది. అనంతరం ఛేజింగ్‌కు దిగిన ఆర్సీబీకి.. ఓపెనర్లు వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32 రన్స్), విరాట్ కోహ్లీ మెరుపు శుభారంభం ఇచ్చారు.

తొలి వికెట్‌కు 27 బంతుల్లో 62 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని ఖరారు చేశారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలోనే వెంకటేశ్ అయ్యర్, దేవ్‌ద్ పడిక్కల్ (1), రజత్ పటీదార్ (15), కృనాల్ పాండ్యా (1) ఔట్ అయ్యారు. అయితే ఓ పక్క వికెట్లు పడుతున్న ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ మాత్రం నిలబడ్డాడు. చివరి వరకూ క్రీజులో ఉండి జట్టుకు రెండో ఐపీఎల్ టైటిల్ అందించాడు. చివరకు ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విరాట్ కోహ్లీ42 బంతుల్లో 75 రన్స్ స్కోరు చేసి, అజేయంగా నిలిచాడు. ఈ ఫలితంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్ సాధించింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత గత సీజన్‌లో తొలి టైటిల్ అందుకున్న ఆ జట్టు ఈ సీజన్‌లోనూ అలాంటి ప్రదర్శనే రిపీట్ చేసింది. మరోవైపు ఐపీఎల్‌లో తమ అరంగేట్ర సీజన్ అయిన 2022లో విజేతగా నిలిచిన గుజరాత్.. రెండోసారి ఐపీఎల్ ఫైనల్‌లో ఓడిపోయింది. ఐపీఎల్ 2023 ఫైనల్‌లోనూ సీఎస్కే చేతిలో గుజరాత్ టైటాన్స్ పరాజయం పాలైంది.

## జనం ఛీకొట్టినా జగన్ డ్రామాలు మానడం లేదు

చిత్రీకరించడం, కోడికత్తి దాడి, ఎన్నికల ప్రచారంలో గులకరాయి డ్రామాలు వంటి నాటకాల రాయుడైన జగన్ ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం మరో కొత్త డ్రామాకు తెరలేపారంటూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే సైకో జగన్ తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను రంగంలోకి దింపారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలను చూసి ప్రజలు ఇప్పటికే ఛీకొట్టినా, జగన్ మాత్రం తన క్షుద్ర రాజకీయాలు మానడం లేదని, ఎన్నిసార్లు తప్పు చేస్తూ దొరికిపోయినా ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని నారా లోకేష్ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే వైసీపీ అధినేత జగన్ మాత్రం పదే పదే డ్రామాలాడుతూ దొరికిపోతున్నారని ఎద్దేవా చేశారు.

# జెన్ జీ యువత కోసం 'సేనా గళం' కమిటీ

ఆరోపణలు చేయించాలి అనే బూర్జువా ధోరణిని తోసిరాజంటూ సేనా గళం పని చేయాలని స్పష్టం చేశారు. జనసేన అభ్యుదయ భావాలతో ముందుకు వెళ్లాలని పాతబడి బూజుపట్టిన విధానాలకు తిలోదకాలు ఇవ్వాలని జనసేనాని నిర్ణయించారు.

రాజకీయ పార్టీగా సామాజిక బాధ్యతతో జనసేన పార్టీ ముందుకు వెళ్తూ సేనా గళం ఏర్పాటు చేసినట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో కొందరు వ్యక్తుల తప్పులను వారి వ్యక్తిగత చర్యలుగా కాకుండా, వారు చెందిన కులం, మతం లేదా వర్గాలతో ముడిపెట్టి సామాజిక విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు ఇది సమాజంలో విద్వేషాలకు కారణం అవుతోందని అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కొందరు కులం, మతం, ప్రాంతీయత వంటి భావావేశాల ముసుగు వేసుకుని దాక్కొనే ప్రయత్నం చేస్తున్నారనీ.. ఇటువంటి రాజకీయ సంస్కృతిని నేటి యువత తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్న వాస్తవాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలి తప్ప, సామాజిక వర్గాలను ఆ వ్యవహారంలోకి లాగకూడదనే స్పష్టమైన విధానాన్ని జనసేన పార్టీ అవలంబిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి

అయిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన 6 నెలల్లోనే ఆ దుస్థితిని మార్చి, 79 ఏళ్ల భారత చరిత్రలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఏకైక నేతగా నిలిచారన్నారు.

కేసీఆర్ గుర్తులు చెరిపేస్తానంటున్న రేవంత్ రెడ్డి, చివరికి రైతన్నల నోటికాడి కూడును లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ రైతు వ్యతిరేక కుట్రలపై ప్రజలు కూడా స్పందించి రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

### హైడ్రా భూతంతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు: కేటీఆర్ ఆగ్రహం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా హైదరాబాద్ నగరంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని కేటీఆర్ విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంటి వారు వచ్చి 6 వేల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు కనీసం ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, 20 వేల లీటర్ల ఉచిత తాగునీరు అందించడంతో పాటు జీవో 58, 59 ద్వారా పేదలకు భూమి హక్కులు కల్పించామని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా అనే భూతాన్ని తెచ్చి పేద ప్రజల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూలగొడుతోందని, వారికి తీరని అన్యాయాన్ని చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో డిఫెన్స్ భూముల బదలాయింపు కోసం, కరీంనగర్, నిజామాబాద్ వైపు స్కైవేల నిర్మాణం కోసం నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై తెచ్చిన ఒత్తిడి వల్లే నేడు ఆ పనులు సాకారమయ్యాయని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే ఆర్మీ అధికారులు అడ్డగోలుగా రోడ్లు మూసివేస్తే కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించింది తామేనన్నారు. దేశమంతా కాంగ్రెస్ అనే దరిద్రాన్ని తిరస్కరిస్తే, తెలంగాణలో మాత్రం అది మళ్లీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికలు లేకపోయినప్పటికీ, కార్యకర్తలంతా కలిసికట్టుగా ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ చారిత్రాత్మక మైలురాయి

రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## విజయ్‌ని చూశాక.. తెలంగాణలో ధైర్యం వచ్చింది

కట్టబెట్టాలని ప్రజలు భావిస్తున్నారని తన మనసులోని ఆమె మాట బయటపెట్టారు. గత 2, 3 ఏళ్లలో తాను ఎన్నో కష్టాలు ఎదుర్కొని అడ్డంకులు దాటినట్లు చెప్పుకొచ్చారు. అప్పుడు వేలాది మంది మద్దతుదారులు తనకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. తాను జైలులో ఉన్నప్పుడు బయటికి వచ్చిన తర్వాత కూడా తనను ఆదరించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఏం ఇచ్చి వారి రుణం తీర్చుకోవాలో తనకు తెలియడం లేదని కవిత పేర్కొన్నారు. ఆ విధంగా తనకు మద్దతుదారులు ఉన్నారని వేలాది మంది టీఆర్ఎస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని వెల్లడించారు. అయితే ఒకరికి మద్దతు అనేది ఊరికే రాదని పార్టీ పెట్టిన 10 రోజుల్లో జెండా పండగ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీలో అలాంటి కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తలు ఉన్నారని వారితోనే పార్టీ నిర్మాణం జరుగుతుందని తేల్చి చెప్పారు.

తాను ఒక స్ట్రాంగ్ లీడర్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నానని ఎలాంటి అపజయం వచ్చినా వెనక్కి తగ్గకుండా ఎలా ఉండాలో తెలుసని స్పష్టం చేశారు. పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో అవన్నీ చూసి పెరిగిన వ్యక్తిని అని తెలిపారు. పార్టీల ఫెయిల్యూర్ అయిన తర్వాత తెలంగాణ ఉద్యమం విజయం అయిందని గుర్తు చేశారు. ఓటమి చూసి నేర్చుకుంటున్నామని బీఆర్ఎస్ మాదిరిగా ఓడిపోకుండా పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు కవిత వివరించారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో పార్టీలు పెట్టి ఫెయిలైన నేతలు ఉన్నారని ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత వివరించారు. ఇంద్రారెడ్డి, దేవేందర్ గౌడ్, చిరంజీవి వంటి నాయకులు పార్టీలు పెట్టినా వాటిని విజయవంతంగా నడపలేకపోయారని గుర్తు చేశారు. అయితే వారేమీ చిన్న నేతలు కాదని అలాగే వైఎస్ షర్మిల కూడా పార్టీ పెట్టారని కానీ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసినట్లు చెప్పుకొచ్చారు. కొందరు ఫెయిలైన పార్టీలను చూపించి తమ పార్టీ కూడా అలాగే అవుతామని చెబుతున్నారని అయితే అది కరెక్ట్ కాదని కొట్టిపారేశారు. వందకు వెయ్యి శాతం టీఆర్ఎస్ పార్టీని సక్సెస్ చేసి చూపిస్తామని కవిత తేల్చి చెప్పారు.

# నీ ఏడుపే బీజేపీకి శాపం

కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను టార్గెట్ చేస్తూ ఫ్లెక్సీలు వెలియడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఈ ఫ్లెక్సీలు అంటించి ఉండటం గమనార్హం. ఆ ఫ్లెక్సీలు సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడం, వార్తలు చక్కర్లు కొట్టడంతో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు రియాక్ట్ అయ్యారు. ఆ ఫ్లెక్సీల్లో ఈటల రాజేందర్ లక్ష్యంగా రాతలు ఉండటం గమనార్హం. 'నీ ఏడుపే బీజేపీకి శాపం' అనే హెడ్డింగ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఈటల రాజేందర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదని కేంద్రమంత్రి పదవి దక్కలేదని ఈటల రాజేందర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారంటూ ఆ ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. ఈటల రాజేందర్‌కు 2 చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించడంతో పాటు రెండు చోట్ల ఓడిపోయిన తర్వాత కూడా మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ కూడా ఇచ్చింది బీజేపీ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గెలుపొందిన తర్వాత కూడా తన ఇమేజ్‌తోనే గెలిచాను అని ఈటల రాజేందర్ చెప్పడం రాజకీయ నైతికత కాదని ఆ ఫ్లెక్సీల్లో విమర్శలు గుప్పించారు. అదే సమయంలో బీసీ నాయకుడు ఎదుగుతుంటే అసహనం ఎందుకని ఎంపీ ధర్మపురి అరవింద్‌కు లభిస్తున్న ఆదరణను చూసి కడుపుమంట ఎందుకని అందులో ప్రశ్నించారు. తాను బీసీ నాయకుడిని తానే ప్రత్యామ్నాయం అనే భావన నుంచి బయటకు రావాలని ఈటల రాజేందర్‌కు సూచిస్తూ ఫ్లెక్సీల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఫ్లెక్సీలకు సంబంధించిన ఫోటోలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అసలు వాటిని ఎవరు ఏర్పాటు చేశారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వెనుక ఉద్దేశం ఏంటి అనేది ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. ఈ ఫ్లెక్సీల వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న వేళ తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పందించారు. తెలంగాణలో రోజురోజుకూ బీజేపీ బలం పెరుగుతోందని ఓర్వలేక ఇతర పార్టీలకు చెందిన నేతలు, బయటి వ్యక్తులు ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. తమ పార్టీ నేతల మధ్య వివాదాలు రేపాలని కుట్రలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. తెలంగాణ బీజేపీ నేతలు కలిసికట్టుగా ఐక్యంగా పనిచేస్తున్నారని అందుకే పార్టీ గ్రాఫ్ పెరిగిందని తేల్చి చెప్పారు.

# భారత త్రివిధ దళాలకు కొత్త బాస్

మరింత బలోపేతం చేయడంపై రాజా సుబ్రమణి దృష్టి సారించనున్నారు. ఇక చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఢిల్లీలోని సౌత్ బ్లాక్ లాన్స్ లో జనరల్ రాజా సుబ్రమణికి త్రివిద దళాలు గౌరవ వందనాన్ని సమర్పించాయి. ఆ తర్వాత దేశ రాజధానిలోని అమరవీరుల స్థూపం వద్ద రాజా సుబ్రమణి నివాళులు అర్పించారు. గతంలో నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్(ఎన్ ఎస్సీ ఎస్)లో సైనిక సలహాదారుగా రాజా సుబ్రమణి సేవలు అందించారు. అలాగే గతేడాది జులై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా ఆయన పదవీ విరమణ చేశారు. భారత కొత్త చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జనరల్ రాజా సుబ్రమణి మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలను వెల్లడించారు. సాయుధ దళాల్లో రూపాంతరం, సంస్థాగత సంస్కరణల అమలే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రధానమంత్రి ప్రతిపాదించిన జేఏఐ (జాయింట్ నెస్, ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్) దృష్టికోణాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, రక్షణ మంత్రిత్వ శాఖ, వ్యూహాత్మక సంస్థలు, సంబంధిత వర్గాలన్నీ ఐక్యంగా పనిచేసేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మన సైనికులు, నావికులు, వాయుసేన యోధుల ధైర్యాన్ని, వృత్తి నైపుణ్యాన్ని మేం ఎప్పుడు గుర్తుంచుకుంటామన్నారు. అలాగే దేశ భద్రతకు ఆత్మనిర్భరతే మూలస్తంభమని, స్వదేశీ ఆయుధాల అభివృద్ధి, సైన్యంలో వాటి వినియోగాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. ఇక జనరల్ రాజా సుబ్రమణి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గానే కాకుండా రక్షణమంత్రికి ప్రధాన సైనిక సలహాదారుగా కూడా వ్యవహరిస్తారు.

# చుక్క రక్తంతో క్యాన్సర్ గుట్టురట్టు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నిమ్స్ క్యాన్సర్ వైద్య రంగంలో సరికొత్త మైలురాళ్లను అందుకుంటోంది. నానాటికీ పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి రోగులకు ఖచ్చితమైన చికిత్స అందించడమే లక్ష్యంగా నిమ్స్ యాజమాన్యం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్ ద్వారా రోగులకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. తాజాగా ఈ కేంద్రం ఆధ్వర్యంలో మరికొన్ని విప్లవాత్మక చికిత్సా విధానాలను రోగులకు అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే నిమ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన లిక్విడ్ బయాప్సీ సేవలను ప్రారంభించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. ప్రస్తుతం నిమ్స్ క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్‌లో నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ సాంకేతికతను విజయవంతంగా వినియోగిస్తున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన లోపాలు, మార్పులను డీఎన్ఏ, ఆర్ఎన్ఏ స్థాయిల్లో అత్యంత నిశితంగా గుర్తిస్తారు. సాంప్రదాయ చికిత్సలలా కాకుండా.. ప్రతి రోగి శరీరతత్వానికి, వారి క్యాన్సర్ కణాల జన్యు నిర్మాణానికి తగినట్లుగా అందించే 'టార్గెటెడ్ థెరపీ'కి ఈ ఎన్‌జీఎస్ పరీక్షలు ఎంతో కీలకంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైమండ్ ప్రాజెక్టులో భాగంగా నిమ్స్ ఈ సేవలను ప్రవేశపెట్టింది. 2024 సంవత్సరం నుండి ఇప్పటివరకు దాదాపు 1,443 మంది రోగులకు ఈ అత్యంత ఖరీదైన జన్యు పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించి వారికి మెరుగైన టార్గెటెడ్ చికిత్సలను అందించినట్లు డాక్టర్ బీరప్ప వివరించారు.

ఈ ఎన్‌జీఎస్ సేవలకు అదనంగా నిమ్స్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో సరికొత్త లిక్విడ్ బయాప్సీ పరీక్షలను ప్రవేశపెడుతుండటం వైద్య రంగంలో ఒక పెద్ద ముందడుగుగా భావిస్తున్నారు. సాధారణంగా క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి శరీరంలోని కణితి నుండి కొంత భాగాన్ని శస్త్రచికిత్స లేదా సూది ద్వారా సేకరించి టిష్యూ బయాప్సీ చేస్తారు. అయితే ఈ పాత పద్ధతికి భిన్నంగా కేవలం ఒక్క రక్తపు చుక్కతోనే క్యాన్సర్ ముదిరిన తీరును, దాని తీవ్రతను గుర్తించే వీలు ఈ లిక్విడ్ బయాప్సీ ద్వారా కలుగుతుందని నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ వివరించారు. రక్తంలో ప్రవహించే క్యాన్సర్ కణాల తాలూకు డీఎన్ఏ ఆధారంగా ఈ పరీక్ష పనిచేస్తుంది. దీనివల్ల రోగి శరీరానికి ఎటువంటి గాయం లేదా శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉండదు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయల ఖర్చుతో కూడుకున్న ఈ ఎన్‌జీఎస్, లిక్విడ్ బయాప్సీ పరీక్షలన్నింటినీ పేద, మధ్యతరగతి రోగుల సంక్షేమం దృష్ట్యా ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగానే అందిస్తామని నిమ్స్ డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మద్దతుతో అందుబాటులోకి వస్తున్న ఈ అత్యాధునిక సేవలు ఎంతోమంది క్యాన్సర్ బాధితులకు పునర్జన్మను ప్రసాదించనున్నాయని చెప్పారు.

# ఉత్తరాంధ్ర చిరకాల స్వప్నం సాకారం

- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో అభివృద్ధికి నూతన శకం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- డబుల్ ఇంజన్ సర్కార్' సంకల్పానికి ప్రతీకగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రారంభం
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దూరదృష్టి ఫలితమే ఈ చారిత్రక ఘట్టం
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి



నిమ్మాడ(ప్రశ్న న్యూస్)ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, మూడు తరాల పోరాటాల ఫలితంగా విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపటి నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనుండటం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో సువర్ణ అధ్యాయానికి నాంది పలికే మైలురాయని ఆయన అభివర్ణించారు. దీర్ఘకాలంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు చేసిన నిరంతర ఉద్యమాలకు ఇది విజయ చిహ్నమని మంత్రి తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ సర్కార్' కృషి వల్లే ఈ మహత్తర లక్ష్యం సాకారమైందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ అంశాన్ని చేర్చేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన యుగానికి నాంది. ఇది ప్రాంతీయ ఆకాంక్షల విజయమే కాకుండా, సమగ్ర అభివృద్ధి దిశగా భారత రైల్వే చరిత్రలో నిలిచిపోయే ఘట్టం" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు ధగధగా మెరిసిపోతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనం -- సర్వపాప ప్రాయశ్చిత్తంపౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, జేఈవో (ఆరోగ్యండవిద్య) డాక్టర్ శరత్, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై దాడి దురదృష్టకరం:హోం మంత్రి అనిత



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. లంకెలపాలెం వద్ద విధులు నిర్వర్తిస్తున్న సమయంలో దుండగుల దాడికి గురై గాయపడిన హోంగార్డు వెంకటరమణ ప్రస్తుతం షీలా నగర్ కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లిన హోం మంత్రి అనిత, వెంకటరమణను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు వెంకటరమణపై కత్తితో దాడి చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని అన్నారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు అయినప్పటికీ, పోలీసులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో వెంకటరమణ చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఘటనకు పాల్పడిన నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం అనునిత్యం కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని, వారి విధుల నిర్వహణకు ప్రజలు కూడా సహకరించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.



## గర్భిణీలలో కాల్షియం లోపిస్తే..
### ఆ సమస్యలను ఆహ్వానించినట్టే..

ప్రతీ మహిళ జీవితంలో గర్భం దాల్చడం అనేది ఒక కీలక ఘట్టం. మరో జీవికి జన్మనిస్తున్నాన్న సంతోషం ఓవైపు, ఏదో తెలియని భయం మరోవైపు. మహిళల్లో మానసిక ఇబ్బందులకు దారి తీస్తుంటాయి. అందుకు గర్భిణీలుగా ఉన్న సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతుంటారు. ముఖ్యంగా తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తల్లితో పోటు కడుపులో బిడ్డకు కూడా అవసరమైన పోషకాలు అందేలా ఫుడ్ తీసుకోవాలని సూచిస్తుంటారు. గర్భం దాల్చిన సమయంలో మహిళల శరీరంలో విటమిన్స్ లోపం అస్సలు ఉండకూడదు. ముఖ్యంగా క్యాల్షియం లోపం ఉన్నట్లయితే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో కాల్షియం శరీరంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు. కాల్షియం ఎముకలు, దంతాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గర్భధారణ సమయంలో శిశువు ఎముకలు, దంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఇందుకు కాల్షియం ఎంతో అవసరం. శిశువుకు కాల్షియం తల్లి శరీరం నుంచి లభిస్తుంది. తల్లి శరీరంలో కాల్షియం లోపం ఉంటే పుట్టబోయే బిడ్డపై ప్రభావం పడుతుంది. అంతేకాకుండా గర్భిణీలోనూ ఎముకలు బలహీనంగా మారుతాయి. భవిష్యత్తులో బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. ఇక పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కూడా కాల్షియం లోపం తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. శిశువు ఎముకలు సరిగ్గా అభివృద్ధి చెందవు. ఇది పుట్టిన తరువాత శిశువులో బలహీనతకు దారితీస్తుంది. అలాగే శిశువు గుండె, కండరాలతో పాటు నరాల అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. బిడ్డ కడుపులో తగినంత కాల్షియం పొందకపోతే.. అది భవిష్యత్తులో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయంలో స్త్రీలకు రోజుకు 1000 నుంచి 1200 %ఎన్త్ర% కాల్షియం అవసరం ఉంటుంది. ఇది పాలు, పెరుగు, జున్ను, ఆకుకూరలు, నువ్వులు, బాదం వంటి ఆహార పదార్థాల ద్వారా లభిస్తుంది. అయితే నువ్వులు వేడి చేసే అవకాశం కూడా ఉంటుంది. కాల్షియం లోపం ఉంటే వైద్యుడి సూచన మేరకు కాల్సియం సప్లిమెంట్స్‌ను తీసుకోవచ్చు.

## బాడీలో ఈ లక్షణాలు కనిపిస్తే..
### కొలెస్ట్రాల్ పెరిగినట్లే..?



కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, మొదటగా కనిపించే లక్షణం కాళ్ళలో నొప్పి లేదా తిమ్మిరి. నడుస్తున్నప్పుడు లేదా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కాళ్ళలో బరువు లేదా తిమ్మిరి ద్వారా దీనిని గుర్తించవచ్చు. చేతులు మరియు కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు లేదా చల్లగా అనిపించడం కూడా అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు. కొంతమందిలో, పాదాల రంగు కూడా నీలం రంగులో కనిపించడం ప్రారంభమవుతుంది. ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి కూడా పెరిగిన కొలెస్ట్రాల్ ప్రధాన లక్షణం. వాస్తవానికి, కొలెస్ట్రాల్ ధమనులలో పేరుకుపోయినప్పుడు, ఛాతీలో మంట లేదా బిగుతుగా అనిపించడం జరుగుతుంది. ఇది గుండెపోటు లేదా కరోనరీ ఆర్టరీ వ్యాధికి సంకేతం కావచ్చు. మెడ, దవడ లేదా భుజంలో నొప్పి కూడా దీనికి సంకేతం కావచ్చు. శరీరంలో రక్త ప్రవాహం తగ్గినప్పుడు, ఈ భాగాలలో అసాధారణ నొప్పి లేదా దృఢత్వం అనుభూతి కలుగుతుంది. దీనిని ప్రజలు తరచుగా కండరాల నొప్పిగా భావించి విస్మరిస్తారు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు. పసుపు రంగు లేదా కళ్ళ చుట్టూ పసుపు వలయాలు ఏర్పడటం కూడా దాని లక్షణాలు కావచ్చు. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి క్షీణిస్తోందనడానికి సంకేతం. మీ శరీరంలో ఇలాంటి మార్పులు గమనించినట్లయితే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్స ఈ పరిస్థితి తీవ్రంగా మారకుండా నిరోధించవచ్చు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.

## మీకు గ్యాస్ సమస్య
# ఉందా?
### ఈ ఇంటి చిట్కాలతో హాంఫట్..



సరిపడ నీరు తాగని కారణంగా కూడా జీర్ణ సంబంధిత సమస్యలతో పాటు, గ్యాస్ వేధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కచ్చితంగా సరిపడ నీటిని తీసుకోవాలి. వాతావరణం చల్లగా ఉందని కొందరు నీటిని తాగడం మానేస్తుంటారు. కానీ దాహంతో సంబంధం లేకుండా కచ్చితంగా రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీటిని తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఆహారంలో పండ్లు, కూరగాయలను కచ్చితంగా భాగం చేసుకోవాలి. ఇలాంటి ఫుడ్‌ను నిత్యం తీసుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు దరిచేరవు. కడుపు నిత్యం లైట్‌గా ఉంటుంది. త్వరగా జీర్ణమై కడుపు ఉబ్బరం వంటి సమస్య దరిచేరదు. ఇక జీర్ణవ్యవస్థ మెరుగుపడి, గ్యాస్ సమస్యలు తగ్గాలంటే క్రమంతప్పకుండా వ్యాయామం చేయాలని నిపునులు చెబుతున్నారు. వ్యాయామంతో శరీరం ఫిట్‌గా ఉండడమే కాకుండా, జీర్ణ సమస్యలు కూడా దరచేరవు. మనలో చాలా మంది ఆహారం తీసుకునే సమయంలో చేసే తప్పు.. భోజనాన్ని త్వరగా నమిలి మింగేయడం. ఇలా చేయడం వల్ల కూడా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఆహారాన్ని వీలైనంత ఎక్కువసార్లు నమిలి మింగాలి. ఇలా చేస్తే ఆహారం త్వరగా జీర్ణమై గ్యాస్ సమస్య దరిచేరదు. ఒత్తిడి కూడా జీర్ణ సంబంధిత సమస్యకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకునే పనులు చేయాలి. ఇందుకోసం యోగా, మెడిటేషన్ వంటి వాటిని కచ్చితంగా జీవనశైలిలో ఒక భాగం చేసుకోవాలి. తీసుకునే ఆహారంలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండే ఫుడ్‌ను తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యం మెరుగవుతుంది. గ్యాస్ సమస్య నుంచి బయటపడాలంటే కచ్చితంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతీరోజూ పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ బలోపేతమవుతుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చు.

## ఈ ఒక్క చిట్కాతో
# నిగారించే చర్మం మీ సొంతం!



మీరు ఏమి చేసినా, మన చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ మార్పులు ఖచ్చితంగా మన చర్మంపై ప్రభావాన్ని చూపుతాయి. ప్రజెంట్ డేస్‌లో చాలా మంది ఎదుర్కొనే సాధారణ సమస్య నిస్తేజమైన చర్మం. దీని నుంచి బయటపడి మంచి నిగారించే చర్మాన్ని పొందాలని చాలా మంది అనుకుంటారు. అందుకోసం ఏవేవో ప్రయత్నాలు చేసి విఫలం అయి ఉంటారు. కానీ మన ఇంటి పరిసరాల్లో లభించే సహజమైన పుదీనా, నిమ్మరసంతో మన చర్మాన్ని మెరిసేలా చేసుకోవచ్చుంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ రెండింటిని కలిపి రసం తయారు చేసుకుని త్రాగడం వల్ల. కొద్ది రోజుల్లోనే మన చర్మం నిగారింపుగా మారుతుందని చెబుతున్నాయి. పుదీనా, నిమ్మరసం మీ చర్మ ఆరోగ్యాన్ని పెంచడానికి సహాయపడుతాయి. చర్మ సమస్యలకే కాదు.. వేసవి వేడి నుండి ఉపశమనం పొందడానికి కూడా ఈ రసం గొప్ప మార్గం. వీటిలో ఉండే పోషకాలు మీరు కోరుకునే మెరిసే చర్మాన్ని అందించడంలో సహాయపడతాయి. మొటిమలు ఉన్నవారికి పుదీనా చాలా మంచిది. పుదీనా ఆకులు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను, సాలిసిలిక్ ఆమ్లాన్ని కూడా కలిగి ఉంటాయి. కాబట్టి మీ ఆహారంలో పుదీనాను చేర్చుకోవడం ద్వారా, మీ చర్మం బిగుతగా మారడంతో పాలు సహజమైన మెరుపును పొందుతుంది. పుదీనా రసం తాగడమే కాకుండా, మీరు పుదీనాను నేరుగా మీ చర్మానికి మాస్క్ రూపంలో కూడా అప్లై చేయవచ్చు. నిమ్మకాయలో మనకు విటమిన్ సి పుష్కలంగా దొరుకుతుంది. ఇది మీ చర్మ ఆరోగ్యానికి అత్యంత అవసరమైన విటమిన్లలో ఒకటి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (NIH) ప్రకారం, నిమ్మకాయలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.


వాటిలో సిట్రిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. బ్లాక్ హెడ్స్, మొటిమల వంటి చర్మ సమస్యలను వదిలించుకోవడానికి నిమ్మరసం చాలా మంచిది. పుదీనా, నిమ్మరసం రసాన్ని మీరు ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మీరు ఇంట్లో తయారు చేసుకోగల సులభమైన జ్యూస్‌లలో ఇది కూడా ఒకటి. దీన్ని తయారు చేయడానికి, ముందుగా మీరు పుదీనా ఆకులు, ఉప్పు, నిమ్మరసం, తేనె, సోంపు గింజలను బ్లెండర్‌లో కొద్దిగా నీటితో రుబ్బుకోవాలి. తరువాత ఐస్ క్యూబ్స్, దోసకాయ ముక్కలు, తులసి ఆకులు ఒక గ్లాసులో వేసుకోవాలి. తయారుచేసిన మిశ్రమాన్ని గ్లాసులో పోసి బాగా కలపండి. ఇప్పుడు మీరు ఈ రుచికరమైన రసాన్ని తాగవచ్చు. ఇలా చేయడం ద్వారా కొన్ని రోజుల్లోనే మీ చర్మం నిగారింపుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## బ్యూటీ పార్లర్లకు వెళ్లే మహిళలు జాగ్రత్త..!



ప్రస్తుత రోజుల్లో చాలా మంది అందంగా కనిపించేందుకు ఆరాటపడుతున్నారు. అందంకోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది తమ జుట్టు, ముఖ సౌందర్యం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సెలూన్, బ్యూటీ పార్లర్లకు వెళతారు. అలా తరచూగా బ్యూటీ పార్లర్లలో షాంపూ చేయించుకునే వారికి ఇదోక హెచ్చరిక..ఇప్పుడు 'బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్' అనే కొత్త సమస్య ప్రజల్ని భయపెడుతోంది. ఇది మీ మెడ, వీపుపై ఒత్తిడి వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్య. చాలా సెలూన్లలో షేవింగ్ చేసిన తర్వాత, లేదంటే హెయిర్ కలర్ వేయించున్న తరువాత అక్కడే హెయిర్ వాష్ చేయించుకుంటారు. ఇందులో వాషింగ్ కోసం ఉపయోగించే బ్యాక్ వాష్ బేసిన్లపై వాలతాము. ఇది మన మెడలను ఇబ్బందికరమైన కోణంలో కుదిస్తుంది. ఇది మెడ నొప్పి, గాయం, చాలా అరుదైన సందర్భాల్లో ప్రాణాంతక స్ట్రోక్‌లకు దారితీస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌ను మొదట 1993లో అమెరికన్ న్యూరాలజిస్ట్ మైఖేల్ విన్స్ట్రాబ్ గుర్తించారు. ఈ సమస్యతో బాధపడే ముందు బ్యూటీ పార్లర్‌లో జుట్టును షాంపూతో శుభ్రం చేసుకున్న రోగులకు తీవ్రమైన స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయని ఆయన కనుగొన్నారు. స్ట్రోక్ అంటే మెదడుకు రక్త ప్రసరణలో అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడటం వల్ల కలిగే మెదడు దాడి. ఇది సాధారణంగా రక్తం గడ్డకట్టడం వల్ల వస్తుంది. ఈ సందర్భంలో, ఆక్సిజన్, గ్లూకోజ్, పోషకాలు లేకపోవడం వల్ల మెదడు కణాలు దెబ్బతింటాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌కు ప్రాథమిక కారణం కస్టమర్ తలకు షాంపూతో శుభ్రం చేస్తున్నప్పుడు వాష్‌బేసిన్ అంచున అధిక ఒత్తిడి అని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్ నివారించడానికి ఏం చేయాలి.? : బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌ను నివారించడానికి, బ్యాక్‌వాష్ సింక్‌ను ఉపయోగిస్తున్నప్పుడు మీకు నొప్పి, అసౌకర్యం ఎదురైతే, వెంటనే లేచి మీ మెడకు విశ్రాంతి ఇవ్వండి. లేకపోతే, కొంత వ్యాయామం కోసం మీ మెడను కుడి, ఎడమ వైపుకు తిప్పడానికి ప్రయత్నించండి. మీరు మీ జుట్టును కడుక్కోవాల్సిన అవసరం ఉంటే, ఒత్తిడిని తగ్గించడానికి మీ మెడ కింద ఒక టవల్ పెట్టుకోండి. ఇది

# జీవితంలో సక్సెస్ సాధించాలనే
# తపన మీకూ ఉందా?



జీవితంలో విజయం సాధించాలని అందరూ కోరుకుంటారు. కానీ కొందరికే ఇది సాధ్యమవుతుంది. విజయం అంత తేలికగా ఎవరికీ దక్కదు. ఇందుకోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సానుకూల దృక్పథం కలిగి ఉండటం, స్వీయక్రమశిక్షణ, కృషిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యం. అదేవిధంగా విజయం కోసం పరితపించేవాళ్లు ప్రతి ఉదయం కొన్ని అలవాట్లను అనుసరించాలి. ఎందుకంటే ఉదయం అలవాట్లు మొత్తం రోజును ప్రభావితం చేస్తాయి. ఉదయం సరైన మార్గంలో ప్రారంభిస్తే మన శక్తిసామర్థ్యాలు, మానసిక స్థితి మెరుగుపడుతాయి. మీరూ జీవితంలో విజయం సాధించాలనుకుంటున్నారా? అయితే మీరూ ఈ అలవాట్లను కొనసాగించండి. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయాన్నే నిద్రలేస్తారు. ఇలాంటి వారు సాధారణంగా ఉదయం 4:30 నుంచి 6:00 గంటల మధ్య నిద్రలేచి తమ రోజును ప్రారంభిస్తారు. ఇలా ఉదయాన్నే నిద్రలేవడం వల్ల రోజంతా అప్రమత్తంగా ఉంటారు. జడత్వం అనేదే వీరిలో ఉండదు. విజయవంతమైన వ్యక్తులు తమ ఉదయాలను ప్రశాంతంగా గడుపుతారు. వీరు ప్రతి ఉదయం ధ్యానం, శ్వాస వ్యాయామాలను అభ్యసిస్తారు. తద్వారా వారి మనస్సును కేంద్రీకరించి సానుకూలంగా మార్చుకుంటారు. ఈ అలవాటు వారి మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. రోజంతా దృష్టి కేంద్రీకరించడంలో సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ చాలా చురుకుగా ఉంటారు. ఎందుకంటే వీరు ఉదయాన్నే నిద్రలేచి యోగా, తేలికపాటి వ్యాయామం వంటి శారీరక శ్రమ చేస్తుంటారు. తద్వారా శరీరాన్ని తాజాగా ఉంచుకోవచ్చు. ఇది రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తింటారు. వారు ఉదయం పండ్లు, పెరుగు, ఓట్స్, గింజలు వంటి ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తింటారు. ఇది సరైన పోషకాహారాన్ని అందిస్తుంది. రోజంతా మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయం పూట తమ రోజంతా లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. వారు ముందుగా ఏ పనులు చేయాలో, మరింత ఉన్నతంగా ఎదగడానికి ఏ ప్రణాళికలు వేయాలో లక్ష్యాలను నిర్దేశిస్తారు. మీరు కూడా అదే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా దశలవారీగా విజయ శిఖరాలను అధిరోహించవచ్చు. సానుకూల ఆలోచనలు విజయానికి మార్గం సుగమం చేస్తాయి.

విజయవంతమైన వ్యక్తులు ప్రతి ఉదయం తమను తాము ప్రేరేపించుకుంటూ, సానుకూలంగా ఆలోచిస్తూ గడుపుతారు. ఇది వారిని రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. మీరు కూడా మీ రోజును ఇలా సానుకూలంగా ప్రారంభించవచ్చు. సక్సెస్‌ఫుల్ వ్యక్తులు తమ సమయంలో ఒక్క సెకను కూడా వృధా చేయరు. వీరు తమ సమయాన్ని చక్కగా నిర్వహిస్తారు. సమయం వృధా కాకుండా ఉండటానికి రోజులో ముందుగా

## 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**బాల్య స్మృతులను గుర్తుచేసుకుంటూ సందడి చేసిన**

**అహ్మదీపూర్ జెడ్పీహెచ్ఎస్ మాజీ విద్యార్థులు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ మండలం, అహ్మదీపూర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అహ్మదీపూర్‌లో 2005-06 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం 20 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.
కార్యక్రమానికి హాజరైన పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని తెలిపారు. వృత్తులు వేరైనా కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా అదే పాఠశాలలో విద్యనభ్యసించి, భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాలతో చిన్న వయసులోనే గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన బ్యాగారి ప్రభాకర్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు సమాజంలో మంచి స్థాయికి చేరుకోవడం ఉపాధ్యాయులుగా ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, 20 సంవత్సరాల తర్వాత చిన్ననాటి స్నేహితులు, తమకు చదువు నేర్పిన గురువులు ఒకే వేదికపై కలుసుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభూతిగా నిలిచిందన్నారు. బాల్యస్మృతులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడం, ఆనాటి సంఘటనలను గుర్తుచేసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.గురువులపై తమకున్న గౌరవం, అభిమానం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. తమ విద్యార్థులు అభివృద్ధి పథంలో పయనిస్తున్న తీరు చూసి కొందరు ఉపాధ్యాయులు భావోద్వేగానికి గురయ్యారు. గత జ్ఞాపకాలను పంచుకుంటూ కార్యక్రమాన్ని ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, లచ్చిరెడ్డి, లక్ష్మారెడ్డి, పరమేష్, నరేందర్ రెడ్డి, శామ్యూల్, రహీం, విఘ్నేశ్వర్ రెడ్డి, సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, నిజామొద్దీన్, నరేష్ గౌడ్, సత్యపాల్, రమేశ్, రఫీ, రజిత, తేజ తదితరులు పాల్గొన్నారు.

# కపిలతీర్థంలో దివ్య చక్రస్నానం

**భక్తి తరంగాల్లో ముగిసిన శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు**

**స్నపన తిరుమంజనంతో ఆధ్యాత్మిక వైభవం**

**ధ్వజావరోహణంతో నేడు బ్రహ్మోత్సవాలకు మంగళం**



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించిన చక్రస్నాన మహోత్సవంతో పరమపవిత్రంగా ముగిశాయి. కపిలతీర్థం ఆళ్వార్ తీర్థం వద్ద జరిగిన ఈ దివ్య ఘట్టాన్ని వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో వీక్షించి పుణ్యఫలాన్ని పొందారు.ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు, చక్రత్తాళ్వార్ ఆలయం నుండి మంగళవాద్యాలు, వేదఘోషలు, గోవింద నామస్మరణల మధ్య ఊరేగింపుగా బయలుదేరి కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి విచ్చేశారు. మార్గమధ్యంలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారికి ఘన స్వాగతం పలికారు.అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్లరసాలతో జరిగిన అభిషేకం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది.తదనంతరం చక్రత్తాళ్వార్‌కు వైభవంగా చక్రస్నానం నిర్వహించగా, తీర్థంలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు అపార భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం స్వామివారు టీటీడీ పరిపాలనా భవనం ఎదుటనున్న పి.ఆర్.తోటకు వేంచేశారు.సాయంత్రం 5 గంటలకు పి.ఆర్.తోట నుండి స్వామివారు ఊరేగింపుగా బయలుదేరి శ్రీ గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకుంటారు. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు.రాత్రి 8.40 గంటల నుండి 9.30 గంటల వరకు నిర్వహించే ధ్వజావరోహణ మహోత్సవంతో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు అధికారికంగా ముగియనున్నాయి.ఈ కార్యక్రమంలో టీటీడీ తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్‌గా

# కల్యాణ శ్రీనివాసుని దివ్య రాజసం

**భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా అనుగ్రహించిన స్వామివారు**



నారాయణవనం(ప్రశ్న న్యూస్) శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు శ్రీ రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. దేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై కొలువుదీరిన స్వామివారు సకల సంపదల ప్రదాతగా, భక్తుల మనోరథాలను నెరవేర్చే కల్పతరువుగా అనుగ్రహించారు. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించిన భక్తులు భక్తి పరవశంలో మునిగిపోయారు.వాహనం ముందుగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు నిర్వహిస్తూ గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. మార్గమధ్యంలో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందారు.పురాణాల్లో కల్పవృక్షానికి విశిష్ట స్థానం ఉంది. దాని నీడను ఆశ్రయించిన వారికి ఆకలి, దప్పులు ఉండవని, పూర్వజన్మ స్మరణ కలుగుతుందని చెబుతారు. ఇతర వృక్షాలు తాము పండించిన ఫలాలను మాత్రమే అందిస్తే, కల్పవృక్షం కోరిన కోర్కెలన్నింటినీ ప్రసాదించే దైవస్వరూపంగా వర్ణించబడింది. ఈ సందేశాన్ని భక్తులకు చాటిచెప్పేలా స్వామివారు కల్పవృక్ష వాహనంపై విహరించారు.ఇదిలా ఉండగా, రాత్రి 7 గంటల నుండి సర్వభూపాల వాహనసేవ వైభవంగా నిర్వహించనున్నారు.ఈ వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో గేమ్ చేంజర్‌గా "జెన్ జీ"

**- భారత రాజకీయాలను జెన్ జీ ప్రభావితం చేయగలదా? - బంగ్లాదేశ్, నేపాల్ పరిస్థితి వస్తుందా?**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దక్షిణాసియా వ్యాప్తంగా జనరేషన్ జెడ్ (జెన్ జీ) ఎదుగుదల రాజకీయాలను పూర్తిగా మారుస్తోంది. సుమారుగా 1990 దశకం చివరి నుండి 2010ల మధ్య జన్మించిన జెన్ జీ, పూర్తిగా స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా యుగంలో పెరిగిన మొదటి తరం. గత తరాలలాగ కాకుండా, వీరు రాజకీయ పార్టీల పట్ల తక్కువ నమ్మకం కలిగి ఉంటారు. కేవలం సమస్యలను బట్టి వీరి ఆలోచనా దృక్పథం ఉంటుంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఎక్కువగా కనెక్ట్ అయి ఉంటారు. ఇప్పటికే బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగు దేశాలలో ప్రభుత్వాలను జెన్ జీ కుదిపేసింది. ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కులైన జనాభాను కలిగిన దేశాలలో భారత్ ఒకటి. ఇక్కడ కూడా జెన్ జీ ఒక ప్రధాన రాజకీయ శక్తిగా మారగలదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమిళనాడులో నటుడు జోసెఫ్ విజయ్ సాధించిన విజయం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసింది. అతని విజయం చాలా మంది సాంప్రదాయ రాజకీయ నాయకులను ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే ఇది పాత ఎన్నికల సూత్రాలను సవాలు చేసింది. విజయ్ సాంప్రదాయ ప్రచారాల కంటే డిజిటల్ ప్రచారం, యువతను ఆకర్షించడంపై ఫోకస్ చేశారు. దశాబ్దాలుగా ఉన్న పార్టీల నుంచి విమర్శలు, వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, పెద్ద సంఖ్యలో యువ ఓటర్లు అతనికి మద్దతు తెలిపారని ఎన్నికల అనంతర విశ్లేషణలు తెలుపుతున్నాయి. భారత్‌లో పెరుగుతున్న జెన్ జీ రాజకీయ ప్రభావానికి ఇది నిదర్శనమని చాలా మంది పరిశీలకులు భావించారు.

### - బంగ్లాదేశ్:

దక్షిణాసియాలో జెన్ జీతో మొదటి ప్రధాన రాజకీయ విజయం 2024 లో బంగ్లాదేశ్‌లో వచ్చింది. ఉద్యోగ రిజర్వేషన్ కోటాలకు వ్యతిరేకంగా విద్యార్థుల నేతృత్వంలో ప్రారంభమైన నిరసనలు వేగంగా దేశవ్యాప్త ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారాయి. యువ నిరసనకారులు భారీ ఎత్తున మద్దతును కూడగట్టడానికి సోషల్ మీడియాను ఉపయోగించారు. అయితే, ఈ ఉద్యమం పూర్తిగా జెన్ జీ తిరుగుబాటు మాత్రమే కాదు. భారత్‌కు అనుకూలంగా భావించే షేక్ హసీనా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు తీవ్రవాద గ్రూపులు, విదేశీ శక్తుల మద్దతు ఉందనే ఆరోపణలు కూడా వచ్చాయి. అయినప్పటికీ, ఈ తిరుగుబాటులో జెన్ జీ ఒక ప్రధాన పాత్ర పోషించింది.

### - నేపాల్:

నేపాల్ 2025 లో ఇంకా బలమైన యువత ఆధారిత ఉద్యమాన్ని చూసింది. సాంప్రదాయ రాజకీయ పార్టీలపై విస్తృతమైన అసంతృప్తి నెలకొంది. చాలా మంది యువకులు ర్యాపర్, రాజకీయ నాయకుడు అయిన బాలెన్ షాకు మద్దతుగా నిలిచారు. 2005 లో రాచరికం రద్దయి, 2007 లో ప్రజాస్వామ్యం ఏర్పడిన తర్వాత నేపాల్ ఇప్పటికే కొన్నేళ్లపాటు అస్థిరతను ఎదుర్కొంది. తరచుగా ప్రభుత్వాలు మారడం వల్ల యువతలో తీవ్ర నిరాశ ఏర్పడింది. రాజకీయ నాయకులు అవినీతిపరులని, అసమర్థులని వారు భావించారు. చాలా మంది విశ్లేషకులు నేపాల్ రాజకీయ మార్పును దక్షిణాసియాలోనే మొదటి నిజమైన జెన్ జీ ఆధారిత రాజకీయ ఉద్యమాలలో ఒకటిగా పేర్కొంటారు. అదివరకే నెలకొన్న రాజకీయ వ్యవస్థలను సవాలు చేసేంత బలంగా జెన్ జీ ఉద్యమాలు ఎదగడానికి కొన్ని పరిస్థితులు అనుకూలిస్తాయి. మొదటిది, ఒకే పార్టీలు అధికారాన్ని శాసిస్తూ ఉండటం వల్ల ఎన్నికలు అర్థరహితంగా అనిపించేలా రాజకీయాలు ఉండాలి. రెండవది, రాజకీయ ప్రముఖులపై బహిరంగ అవినీతి, పెరుగుతున్న ప్రజాగ్రహం తరచుగా కనిపిస్తుంది. మూడవది, ఆర్థిక మందగమనం, నిరుద్యోగం తమ భవిష్యత్తు అనిశ్చితంగా ఉందని భావించే యువతలో నిరాశను కలిగిస్తాయి. నాల్గవది, రాజకీయ పార్టీలు తరచుగా వంశపారంపర్యంగా అవకాశాలు , అనుచరులు, కొందరి నియంత్రణలో ఉండి, కొత్తవారికి తక్కువ అవకాశాన్ని కల్పిస్తాయి. ఛాన్స్ రాకపోతే యువతలో సాధారణంగా నిరాశ నెలకొంటుంది.

భారత్‌లో ఇటువంటి కొన్ని పరిస్థితులు ఉన్నాయి. దేశంలో 25 ఏళ్ల లోపు వయసున్న వారు 600 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఉన్నారు. చాలా మంది యువత నిరుద్యోగం, విద్యాపరమైన ఒత్తిడి, ద్రవ్యోల్బణం, సామాజిక పురోగతికి సంబంధించిన ఆందోళనలను ఎదుర్కొంటున్నారు. యువ ఓటర్లు తమ కుటుంబాల నుండి రాజకీయ విశ్వసనీయతను పొందే అవకాశం కూడా తక్కువగా ఉంది. వారు మరింత వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకుంటారు. పార్టీ కల్చర్ కంటే సమస్యలు, పనితీరు ఆధారంగా నాయకులకు మద్దతు ఇస్తారు.అయితే, భారతదేశం నేపాల్ లేదా బంగ్లాదేశ్ వంటి దేశాల కంటే చాలా భిన్నంగా ఉంటుంది. భారత్‌లోని కొన్ని నిర్మాణాత్మక అంశాలు జెన్ జీ రాజకీయ విప్లవాన్ని కష్టతరం చేస్తాయి. ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ వ్యవస్థలలో భారతదేశం ఒకటి. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా మిలియన్ల మంది ఉచిత రేషన్ ప్రయోజనాలు, వైద్యంలో రాయితీ, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్‌లు, ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు. ఇటువంటి విస్తృతమైన సంక్షేమ నిర్మాణాలు పూర్తి రాజకీయ పతనానికి దారితీసే అవకాశాలను తగ్గిస్తాయి.భారతదేశంలో రాజకీయ అధికారం కూడా విస్తృతంగా ఉంటుంది. పార్లమెంటు నుండి గ్రామ పంచాయతీల వరకు క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతాయి. మిలియన్ల మంది ఎన్నికైన ప్రతినిధులు పాలనలో పాల్గొంటారు. ఈ లోతైన ప్రజాస్వామ్య నిర్మాణం ప్రజలు తమ అసంతృప్తిని పూర్తిగా తిరస్కరించకుండా వ్యక్తం చేయడానికి వారికి అవకాశాలు కల్పిస్తుంది. మరో ప్రధాన వ్యత్యాసం భారత సంస్థల స్థిరత్వం. పలు పొరుగు దేశాలలాగ కాకుండా, భారత సైన్యం పూర్తిగా కేంద్రం నియంత్రణలో ఉంది. న్యాయవ్యవస్థలో జాప్యంపై తరచుగా విమర్శలు వస్తున్నప్పటికీ, చాలా మంది పౌరులు ఇప్పటికీ రాజ్యాంగ సంస్థలు, ఎన్నికలపై నమ్మకాన్ని కలిగి ఉన్నారు.భారతదేశంలో వైవిధ్యం కూడా ఒక కారకంగా పనిచేస్తుంది. దేశవ్యాప్త యువజన ఉద్యమం అంత సులభంగా రాజకీయాలను శాసించలేదు. భారత్ చాలా పెద్ద దేశం. సాంస్కృతికంగా వైవిధ్యమైనది. ప్రాంతీయ భాషలు, గుర్తింపు, స్థానిక రాజకీయ సమస్యలు రాష్ట్రాల వారీగా చాలా భిన్నంగా ఉంటాయి. ఒక రాష్ట్రంలో విజయవంతమైన ఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాపించే అవకాశాలు తక్కువే. యువత నిరాశకు గురికావడానికి పలు కారణాలు ఉన్నాయి. వంశపారంపర్య రాజకీయం ఇప్పటికీ ప్రజలలో ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. రాజకీయ అధికారం కొన్ని కుటుంబాలు, స్థిరపడిన గ్రూపుల పరిధిలోనే కేంద్రీకృతమై ఉందని జెన్ జీ భావిస్తున్నారు. మరింత పారదర్శకత, జవాబుదారీతనాన్ని ఆశించే విద్యావంతులైన యువతను అవినీతి కూడా నిరాశపరుస్తూనే ఉంది. పేలవమైన పాలన అధికార పార్టీలకు పదేపదే పరాజయాలను రుచి చూపించింది. అసమర్థులుగా భావించే నాయకులను ఎన్నికల్లో ఓడించేందుకు భారత ఓటర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పడానికి ఫలితాలే నిదర్శనం.

### - నటుడు విజయ్, జెన్ జి

తమిళనాడులో విజయ్ రాజకీయ ఎదుగుదల ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎందుకంటే ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఈ ఫలితాలు నిరూపించాలయని పరిశీలకులు చెబుతున్నారు. తమిళనాడు ముఖ్యంగా యువత ఆధారిత రాజకీయ మార్పునకు సరిగ్గా సరిపోతుంది. దశాబ్దాలుగా రెండు ద్రవిడ పార్టీలు రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నాయి. వ్యవస్థలో మార్పునకు తక్కువ స్కోప్ ఉందని భావించిన యువ ఓటర్లు విజయ్ వైపు మొగ్గు చూపారు. విజయ్ సెలబ్రిటీ హోదా, అవుట్‌సైడర్ (బయటి వ్యక్తి) ఇమేజ్ అతన్ని ఆ 2 పార్టీల కంటే భిన్నంగా చేసి విజయానికి కారణమయ్యాయి. అయినప్పటికీ, భారత్ వ్యాప్తంగా జెన్ జీ విప్లవం వైపు పయనిస్తోందని భావించడం సరికాదు. భారతదేశ వైశాల్యం, ప్రజాస్వామ్య వ్యవస్థ, సంక్షేమ పథకాలు, ప్రాంతీయ వైవిధ్యం భారీ మార్పునకు అవకాశం ఇవ్వవు. అయితే, రాష్ట్ర స్థాయి యువత తిరుగుబాట్లు, రాజకీయ మార్పులు మాత్రం సాధ్యమే. జెన్ జీ ఇప్పటికే పలుచోట్ల రాజకీయ స్వభావాన్ని మార్చేసింది. డబ్బు, భయం, కుల సమీకరణాలు, వారసత్వ విశ్వసనీయతపై ఆధారపడిన పద్ధతులు యువ ఓటర్లను ఆకర్షించడం లేదు. రాజకీయ పార్టీలు ఇకపై యువతను గతంలోలాగ తమ వైపు తిప్పుకోవడం అంత తేలిక కాదు. భారతదేశం జాతీయ స్థాయిలో జెన్ జీ తిరుగుబాటును చూడకపోవచ్చు, కానీ యువ ఓటర్లు ఎక్కువగా ఎన్నికలను ప్రభావితం చేయవచ్చు. రాజకీయ పార్టీలు అధికారం మారేలా చేయగలరు. భవిష్యత్తులో భారత ప్రజాస్వామ్యంలో జెన్ జీ అత్యంత ప్రభావవంతమైన శక్తులలో ఒకటిగా మారవచ్చు. ప్రత్యేకించి సాంప్రదాయ పార్టీలు నిరుద్యోగం, అవినీతి, వేగంగా మారుతున్న తరం ఆకాంక్షలను పరిష్కరించడంలో విఫలమైతే.. మొదట వంశపారంపర్య రాజకీయాలకు ముగింపు పలకాలి. అది యువత, ప్రజల ఆగ్రహానికి ముఖ్య కారణం. రాజకీయ నాయకులు, కొంతమంది సంపన్నులకు కొమ్ముకాసే పరిస్థితులు ఇప్పుడు లేవు. జెన్ జీ ఎలాంటి నాయకుడికి జై కొడుతుందో ఊహించడం కష్టం. 1975 లో భారత యువత 75 ఏళ్ల జయప్రకాష్ నారాయణ్‌ను తమ నాయకుడిగా అంగీకరించారు. చాలా మంది రాజకీయ నాయకులు యంగ్‌గా కనిపించడానికి ప్రయత్నిస్తారు. యంగ్‌గా కనిపించే దుస్తులు ధరిస్తారు. కానీ పనితీరును సైతం యువ ఓటర్లు గమనిస్తుంటారు. ఎందుకంటే జెన్ జీ కూడా చాలా తెలివైనవారు

## గోదావరి డెల్టాకు ఖరీఫ్ సాగునీటి విడుదల

**రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందస్తు నీటి విడుదల.**

**సీఎం చంద్రబాబు ఆదేశాలతో బ్యారేజీ మరమ్మతులకు రూ.148 కోట్లు**


**-మంత్రి కందుల దుర్గేష్**



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) స్థానిక సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద ఆదివారం ఖరీఫ్ సీజన్ సాగునీటి విడుదల కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.
రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని గోదావరి జలాలను కాలువలకు విడుదల చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నదని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు నాట్లు ముందుగానే వేసుకొని పంటలను రక్షించుకోవాలని సూచించారు. ముందస్తు నీటి విడుదల వల్ల పంట త్వరగా చేతికొచ్చి రైతులు నష్టాల నుంచి బయటపడతారని పేర్కొన్నారు.గత ప్రభుత్వం గోదావరి డెల్టాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయించలేదని మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరల శెట్టి సునీల్ కుమార్, వెస్టన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీ కృష్ణ రాజు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చీఫ్ ఇంజనీర్ చినబాబు, ధవళేశ్వరం ఎస్ ఈ జి. శ్రీనివాస్ రావు, హెడ్ వర్క్స్ ఎస్ ఈ శ్రీనివాస్, ఈ ఈ రామ కృష్ణ, విజ్జేశ్వరం ఈ ఈ రమేష్ బాబు, రైతులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేదార్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత



ఉత్తరాఖండ్‌లో సాగుతున్న కేదార్‌నాథ్ యాత్ర సందర్భంగా విషాదం చోటు చేసుకుంది. వాతావరణం సరిగ్గా లేకపోవడం, అనారోగ్యం కారణంగా ముగ్గురు భక్తులు మరణించారు. వారిలో ఒకరు తెలంగాణకు చెందిన భక్తుడు ఉన్నాడు. భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడటం వంటి కారణాలతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడటం వంటి కారణాలతో యాత్ర సాగడం లేదు. దీంతో ఎక్కడికక్కడ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఈఓసీ) వెల్లడించింది. మృతులు ముగ్గురు రుద్రప్రయాగ్ ప్రాంతంలోనే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో గోపాల్ మిశ్రా (76) యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా అనారోగ్యం కారణంగా మరణించారు. నవగంజి లక్ష్మన్‌జీ ఠాకూర్ (52) అనే వ్యక్తి యాత్రకు వెళ్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన బలగాని బలరాజ్ (49) కూడా అనారోగ్యం కారణంగా మరణించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ వాతావరణ సరిగ్గా లేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులు వెళ్లే రూట్లను మూసివేసి, వారికోసం వసతులు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి రుద్రప్రయాగ్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల భక్తులు వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంది. అందుకే తాత్కాలికంగా యాత్రను నిలిపివేశారు. మళ్లీ వాతావరణం సాధారణ స్తితికి వచ్చిన తర్వాతే యాత్రను తిరిగి ప్రారంభిస్తారు. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీచేశారు. ఈ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు అధికారులు సూచించిన చోట మాత్రమే ఉండాలని కోరారు.

# ఉపాధి హామీ నిధులు స్వాహా

## పీడీ దత్తారావు, ఏపీఓ రాజన్నపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలి




ఆసిఫాబాద్(ప్రశ్న న్యూస్) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని బెజ్జూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జూర్, ఎల్కపల్లి, నాగుల్వాయి గ్రామాలతో పాటు అంబగట్ట గ్రామపంచాయతీ పరిధిలోని రేచిని గ్రామంలో ఉపాధి హామీ పథకం అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పథకం ద్వారా పేద కూలీలకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలకు పూర్తి వేతనాలు అందడం లేదని, కొంత మొత్తమే వారి చేతికి చేరుతోందని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వం పేదల కోసం కేటాయిస్తున్న నిధులు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా.? లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కొన్ని పనుల విషయంలో కూలీలు పనులకు వెళ్లకపోయినా వారి పేర్లపై హాజరు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే పనులు చేసిన వారు ఒకరైతే, రికార్డుల్లో వేరే వారి పేర్లు నమోదు చేస్తున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

దీనివల్ల కష్టపడ్డ వారికి ఫలితం లేకుండా పోతుందని ప్రభుత్వ రికార్డుల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పని చేయని వ్యక్తులతో ఫోటోలు తీసి వాటిని అధికారిక రికార్డుల్లో నమోదు చేస్తున్నారనే ఆరోపణలు కూడా గ్రామస్థుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. జియోట్యాగింగ్, ఫోటో ఆధారాలు, మస్టర్ రోల్స్‌ను కలెక్టర్ పరిశీలిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని ప్రజలు భావిస్తున్నారు.

### కష్టపడ్డ కూలీలకు దక్కని పథకం..

ఉపాధి హామీ పథకం పేదల జీవనోపాధికి ఎంతో కీలకమైనది. అలాంటి పథకంలో అవకతవకలు జరిగితే నిజంగా శ్రమించే కూలీలకే నష్టం జరుగుతుంది. అందుకే ఈ అంశంపై ఉన్నతస్థాయి విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు.ఈ వ్యవహారంలో పీడీ దత్తారావు, ఏపీఓ రాజన్నల పనితీరుపై కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి. గ్రామాల్లో వినిపిస్తున్న ఆరోపణలు ఎంతవరకు నిజమో.? అధికారులు తేల్చాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాన్ని నియమించి బెజ్జూర్, ఎల్కపల్లి, నాగుల్వాయి, రేచిని గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించిన అన్ని రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కూలీల వాంగ్మూలాలు, బ్యాంకు ఖాతాల్లో జమ అయిన వేతనాలు, హాజరు పట్టికలు, పనుల వివరాలను సరిపోల్చి విచారణ జరపాలని కోరుతున్నారు.ప్రజల పన్నుల రూపంలో వచ్చే ప్రభుత్వ నిధులు సరైన లబ్ధిదారులకు చేరేలా చూడడం అధికారుల బాధ్యత. అందువల్ల ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై వస్తున్న ఆరోపణలను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుని, పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరాధారమైతే స్పష్టమైన వివరణతో ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

**- ఏఐఎస్‌బి రాష్ట్ర అధ్యక్షుడు : అతికం రాజశేఖర్ గౌడ్**



పెద్దపల్లి (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బి) రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ విమర్శించారు. పెద్దపల్లి పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు అనేక మౌలిక సదుపాయాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ సాగిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయడంతో పాటు విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించి శాఖలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐఎస్‌బి పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఈర్ల రామ్‌చందర్, నాయకులు హరీష్, సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై కవితకు వినతి

**పరిష్కారానికి కృషి చేస్తానని హామీ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మల్లన్నసాగర్ నిర్వాసితులు ఆర్అండ్ఆర్ కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితకు వివరించి, తమకు రావాల్సిన పరిహారాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కవితను కలిసి నిర్వాసితులు తమ గోడును వినిపించారు. గత ప్రభుత్వం గ్రామాలను ఖాళీ చేయించి ఆర్అండ్ఆర్ కాలనీలకు తరలించినప్పటికీ, పలువురు నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారాలు ఇప్పటికీ పూర్తిగా అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదని, అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని తెలిపారు. తమకు రావాల్సిన పరిహారాలు, ఇతర హక్కులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించి నిర్వాసితుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల నర్సింలు, నరేందర్ రెడ్డి, రాజు, స్వామి, నరేష్, మధు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ ఎస్ లో భగ్గు మన్న విభేదాలు

**- ఓడిపోయిన ఉద్యమకారులకు పార్టీలో గుర్తింపు లేదని కార్యకర్తల ఆందోళన**

**- ఇలానే కొనసాగితే మళ్లీ అధికారంలోకి రావడం కష్టమే సొంత నేతల తిరుగుబాటు**





మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ బిఆర్ఎస్ లో విభేదాలు భగ్గుమన్నాయి. ఇందుకు మేడ్చల్ ఉమ్మడి మండలం కార్యకర్తల సమావేశం సాక్షిగా నిలిచింది. ఈ సమావేశంలో ఉద్యమకారులను అవమానించారంటూ నిరసన తెలిపారు. ఉద్యమకారులను వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించారు అంటూ సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేశారు. ఉద్యమకారులు ఎవరో తెలియని వ్యక్తిని వేదిక మీద కూర్చోబెట్టి పార్టీ ఆవిర్భావం నుండి జెండా మోసిన ఉద్యమకారులను అవమానించారు అంటూ నిరసన తెలిపారు. వేదికపై ప్రసంగిస్తుండగా తన చేతుల్లోని మైకును లాగేసుకొని మళ్లీ మైకు ఇవ్వలేదని ఈ దురంకారానికి నిదర్శనం అని ప్రవీణ్ కుమార్ సంజీవరావు విద్యాసాగర్ నర్సింగరావు లు ఘాటుగా విమర్శించారు. ఇలాంటి నేతల అహంకారంతోనే రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందని, అధికారం పోయిన నేతల్లో అహంకారం మాత్రం తగ్గలేదని ఘాటుగా విమర్శించారు. వీరి ప్రవర్తనలో మార్పు రాకపోతే రాష్ట్రంలో బి ఆర్ ఎస్ అధికారం చేపట్టడం సాధ్యం కాదని ఘాటుగా విమర్శించారు. 20 కోట్లు ఇచ్చి టికెట్లు తెచ్చుకున్న వ్యక్తులకు ఎవరు ఉద్యమకారులో ఎవరు కారో ఎలా తెలుస్తుందని వారు ప్రశ్నించారు. ఉద్యమకారులను కాదని బయట నుంచి వచ్చిన వ్యక్తులకు పెద్దపీట వేయడం దుర్మార్గ చర్యాన్ని విమర్శించారు.

### ఎమ్మెల్యే మల్లారెడ్డి కు గైరాజర్ కారణాలు తెలపాలి

మేడ్చల్ పట్టణంలోని కే ఎల్ ఆర్ వెంచర్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిగిన మేడ్చల్ ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశం కు ఎమ్మెల్యే మల్లారెడ్డి డుమ్మా ఎందుకు కొట్టారంటూ వారు ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతాయనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యే మల్లారెడ్డి సమావేశానికి రాలేదని వారు ప్రశ్నించారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ విభేదాలు పార్టీ అధిష్టానానికి తెలవకపోవడం వల్ల కిందిస్థాయి నేతలు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుందని ఆరోపించారు. అంతేకాకుండా పార్టీ జెండాలు మోసిన కార్యకర్తలను గుర్తించడం లేదు అంటూ వారు ఆరోపించారు. పార్టీ కోసం లాటి దెబ్బలు తిన్న మమ్మల్ని పార్టీ జెండాలు మోయడానికి పరిమితం చేస్తున్నారని విమర్శించారు. పార్టీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు ఇంకా కష్టపడాలి అంటూ నేతలు చెపుతుండడంతో ఇంకా ఎన్నేళ్లు కష్టపడాలి అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఎంత కష్టపడ్డా పార్టీలో గుర్తింపు ఉండడం లేదని మండిపడ్డారు. డబ్బులు పెట్టి టికెట్ తెచ్చుకున్న నేతల మా గురించి మాట్లాడేది అంటూ వారు మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే ఇలా తిరగబడడంతో మేడ్చల్ బిఆర్ఎస్ అగ్రనేతలు షాక్ కు గురయ్యారు

### కూర్చొని సమస్యలను పరిష్కరించుకుంటాం

అసంతృప్తి నేతలతో కూర్చొని పది సమస్యలు పరిష్కరించుకుంటామని మేడ్చల్ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పార్టీలో కార్యకర్తలకు, ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోతుందని అసంతృప్తి నేతల ఆరోపణలపై పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పార్టీలో అసంతృప్తి నేతలు ఎవరూ లేరని ఉంటే వారిని కలుపుకొని వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఇది ఇంటి సమస్య అని దీనిని మేమే పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు.

# గజ్వేల్‌లో మెడల్ బస్ బే ప్రారంభం

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణంలో రూ.2.56 కోట్ల వ్యయంతో నిర్మించిన మెడల్ బస్ బేను ప్రారంభించారు. అనంతరం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో యాదవ రెడ్డి, కె. హైమావతి, లక్ష్మీ కిరణ్, చంద్రకళ, గంగిశెట్టి చందన, నరేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.గజ్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి 1,053 మంది కళ్యాణలక్ష్మి, 56 మంది షాదీ ముబారక్ లబ్ధిదారులకు మొత్తం రూ.11.09 కోట్ల చెక్కులు అందజేశారు. అలాగే వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తున్నామని, త్వరలో ఇంటర్ కళాశాలలకు కూడా ఈ సదుపాయం విస్తరిస్తామని తెలిపారు.గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో పాటు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రబీ సీజన్‌లో ధాన్యం దిగుబడి అంచనాల కంటే 30 శాతం అధికంగా రావడంతో కొనుగోలు సమస్యలు తలెత్తాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రిని కోరారు.

# నేత్రదానం మహా దానం - నంగునూరి సత్యనారాయణ




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) నేత్రదానం మహాదానమని గజ్వేల్ మాజీ ఉపసర్పంచ్ లయన్ నంగునూరి సత్యనారాయణ అన్నారు ఆదివారం గజ్వేల్ లో లయన్ అమర్ నాగేందర్ మృతి చెందగా విషయం తెలుసుకున్న లయన్ నంగునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యుల సమ్మతితో గజ్వేల్ ఐ హాస్పిటల్ వారు నేత్రాలను సేకరించారు ఈ సందర్భంగా లయన్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ నేత్రదానం మహాదానం అని ఒకరి నేత్రాలను తీసుకొని డాక్టర్లు మరో నలుగురికి కంటిచూపు వచ్చే విధంగా చేస్తారని, నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు,ఈ కార్యక్రమంలో లయన్ గోలి సంతోష్,లయన్ దొంతుల సత్యనారాయణ, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, రాజనారాయణ బొమ్మ రమణ, కొత్త గోవర్ధన్,కొత్త శ్యాంసుందర్, సిద్ధి రామచంద్రం, నేతి సంతోష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు

# తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?

**అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్: పద్మబాయి నర్సింగరావు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఎప్పుడు అందజేస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారని గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మబాయి నర్సింగరావు అన్నారు.ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆమె, గజ్వేల్‌లో ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా నిర్వహించిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను తులం బంగారం గురించి ప్రశ్నించడం కనిపించిందన్నారు.కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఇతర హామీలు కూడా అమలవుతాయనే ఆశతో ఎదురుచూస్తున్న ఆడబిడ్డలకు ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, 18 సంవత్సరాలు నిండిన యువతులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అయితే వాటిలో చాలా హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గజ్వేల్‌లో ఇప్పటివరకు రెండు సార్లు మాత్రమే కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొంటూ, ఆ ప్రక్రియ కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదని ప్రజలు చెబుతున్నారన్నారు.ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో భాగంగా ఆర్టీసీ సేవలను మరింత విస్తరించకుండా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, మహిళలకు ప్రకటించిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని పద్మబాయి నర్సింగరావు డిమాండ్ చేశారు.

## 'సేవ్ ది టైగర్స్ 3'

# ట్రైలర్ విడుదల..

### – నవ్వుల సునామీ పక్కా!



తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్‌తో మళ్లీ వచ్చేస్తోంది. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, భార్యాబాధితుల కథకు విశేష ఆదరణ తెచ్చిపెట్టాయి. తాజాగా, ఈ సిరీస్ మూడో సీజన్‌కు సంబంధించిన వినోదభరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు. జూన్ 19 నుంచి ఈ సిరీస్ డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా ఉంది. "పెళ్లి గురించి మనకు చిన్నప్పటి నుంచి అబద్ధాలే చెప్పారు" అంటూ అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. పెళ్లిళ్లపై తమ గోడు వెళ్లబోసుకుంటున్న ముగ్గురు స్నేహితులు ఘంటా రవి (ప్రియదర్శి), రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (చైతన్య కృష్ణ) సంభాషణలతో కథనం సరదాగా సాగుతుంది. "మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాడు నాకు దొరికితేనా" అని విక్రమ్ అనగానే, స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ ప్రత్యక్షమవడంతో కథ ఫాంటసీ మలుపు తీసుకుంటుంది. ఆ తర్వాత, ముగ్గురు స్నేహితుల జీవితాలు అనూహ్యంగా మారిపోతాయి.

ఘంటా రవి ఎమ్మెల్యేగా, రాహుల్ గొప్ప రచయితగా, విక్రమ్ ఓ పెద్ద కంపెనీకి సీఈవోగా కనిపిస్తారు. ఇది నిజమా లేక మరో ప్రపంచంలో జరుగుతోందా అనే గందరగోళం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈసారి ఫాంటసీ అంశాలను జోడించి వినోదాన్ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లినట్టు స్పష్టమవుతోంది. ప్రియదర్శి, అభినవ్, చైతన్య కృష్ణతో పాటు పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మ తమ పాత్రలతో మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు. మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్లుగా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు శ్రీరామ్ ఎరగం దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తే కామెడీకి మాత్రం లోటు ఉండదని భరోసా ఇస్తోంది.

# నచ్చని పనికి 'నో'

## చెప్పడమే నా సక్సెస్: యామీ గౌతమ్



బాలీవుడ్ నటి యామీ గౌతమ్ తన కెరీర్ విజయ రహస్యాన్ని మరోసారి పంచుకున్నారు. తాను నమ్మని పాత్రలు, కథలకు నిర్భయంగా 'నో' చెప్పడం నేర్చుకోవడం వల్లే వృత్తిపరంగా ఎదగగలిగానని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలే మాతృత్వంలోకి అడుగుపెట్టినప్పటికీ, తన వృత్తిపరమైన నిర్ణయాల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ఇటీవల ఓ ఇంగ్లీష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యామీ ఈ విషయాలు వెల్లడించారు. "కెరీర్‌లో నిలదొక్కుకోవాలంటే కొన్నిసార్లు నమ్మకం లేని పనులకు కూడా 'నో' చెప్పడం నేర్చుకోవాలి. నా జీవితంలో ఆ మార్పు 2018లో 'ఉరి', 'బాలా' సినిమాల తర్వాత వచ్చింది. అప్పటి నుంచి నాకు నిజంగా నచ్చిన, నన్ను ప్రభావితం చేసే పాత్రలనే ఎంచుకుంటున్నాను. ఆ తర్వాతే నేను నిర్భయంగా ఉండటం మొదలుపెట్టాను," అని ఆమె వివరించారు. కేవలం ఉపాధి కోసం లేదా పరిశ్రమలో కనిపించడం కోసం సినిమాలు చేయనని గతంలోనూ యామీ స్పష్టం చేశారు. పనిలేకుండా ఉండటానికైనా సిద్ధమే కానీ, నమ్మకం లేని సినిమా మాత్రం చేయనని ఆమె గట్టిగా చెబుతారు. తనకు అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమే ముఖ్యమని యామీ పేర్కొన్నారు. "ప్రేక్షకుల ప్రశంసలకు మించిన పెద్ద అవార్డు మరొకటి లేదు. మిగతావన్నీ క్షణికమైనవి," అని ఆమె అన్నారు. ఈ ఎంపికల వల్లే ఆమె 'ఎ థర్స్ డే', 'దస్వీ', 'ఆర్టికల్ 370' వంటి విజయవంతమైన, విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

## రూ.9 కోట్ల బడ్జెట్‌తో

# రూ.40 కోట్ల వసూళ్లు

### మరాఠీ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'దేవూల్ బంద్ 2'



మరాఠీ సినీ పరిశ్రమలో మరో చిన్న సినిమా భారీ సంచలనం సృష్టిస్తోంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దేవూల్ బంద్ 2' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రముఖ నటుడు, దర్శకుడు ప్రవీణ్ ట్రేడ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో స్నేహల్ ట్రేడ్ మోహన్ జోషి కీలక పాత్రలు పోషించారు. మే 21న విడుదలైన ఈ సినిమా కేవలం తొమ్మిది రోజుల్లోనే సుమారు రూ. 40 కోట్ల వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా మరాఠీ చిత్రాలు పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కినా, బలమైన కథా కథనాలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటుంటాయి. అదే కోవలో వచ్చిన 'దేవూల్ బంద్ 2' కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కేవలం రూ. 9 కోట్ల వ్యయంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే తన బడ్జెట్‌కు నాలుగు రెట్లు పైగా వసూళ్లు రాబట్టింది. అంతేకాకుండా అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-10 మరాఠీ చిత్రాల జాబితాలో చోటు సంపాదించడం విశేషంగా మారింది. ఇక సినిమా కథ విషయానికి వస్తే, సంగీత పేగుడే అనే మహిళా రైతు చుట్టూ కథ తిరుగుతుంది. ఈ పాత్రను స్నేహల్ తార్డే ఎంతో సహజంగా పోషించారు. పేదరికం, అప్పులు, కష్టనష్టాలతో నిత్యం పోరాడే సంగీత తన జీవితంలో మార్పు కోసం ప్రతిరోజూ దేవుడిని ప్రార్థిస్తూ ఉంటుంది. అయితే ఎంత మొరపెట్టుకున్నా తన సమస్యలు తీరకపోవడంతో ఆమె తీవ్ర నిరాశకు గురవుతుంది. ఒక రోజు ఆవేదనతో నది ఒడ్డున ఉన్న చీమల పుట్టపై రాయిని విసిరికొడుతుంది. ఆ ఘటన అనంతరం ఆమెకు ఆధ్యాత్మిక గురువు స్వామి సమ్రత్ దర్శనమిస్తారు. ఆ తర్వాత సంగీత జీవితంలో చోటుచేసుకునే మార్పులు, ఆమె ఎదుర్కొనే సంఘటనలు, విశ్వాసం మరియు జీవిత సత్యాల మధ్య జరిగే సంఘర్షణలే సినిమా ప్రధాన కథాంశంగా తెరకెక్కించబడ్డాయి. గ్రామీణ నేపథ్యంలో ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను మిళితం చేస్తూ దర్శకుడు ప్రవీణ్ తార్డే కథను ప్రేక్షకులకు చేరవేశారు. ముఖ్యంగా రైతుల సమస్యలు, వారి జీవన పోరాటం, భక్తి మరియు నమ్మకాలపై సినిమా తీసుకున్న దృక్పథం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. అందుకే విడుదలైన మొదటి రోజు నుంచే ఈ చిత్రానికి మంచి మౌత్ పబ్లిసిటీ లభించింది. ఈ సినిమా నిర్మాణానికి సంబంధించిన మరో ఆసక్తికర విషయం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

చిత్రీకరణ సమయంలో కీలక సన్నివేశాల కోసం చిత్రబృందం ఏకధాటిగా 33 గంటల పాటు షూటింగ్ నిర్వహించిందని సమాచారం. ఆ కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, పెద్ద స్టార్లు లేకుండా, పరిమిత బడ్జెట్‌తో రూపొందిన 'దేవూల్ బంద్ 2' ప్రస్తుతం మరాఠీ సినీ పరిశ్రమకు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. బలమైన కథ ఉంటే చిన్న సినిమాలు కూడా భారీ విజయాలు సాధించగలవని మరోసారి ఈ చిత్రం నిరూపించింది.

# వినోదాలు పంచే డాక్టర్ బాబు



శ్రీస్కంద హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మన డాక్టర్ బాబే'. చలపతి కుమార్ పువ్వల దర్శకుడు. స్కంద మూవీస్ పతాకంపై కృతాక్షి నిర్మిస్తున్నారు. శనివారం దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్.ఆదిత్య టీజర్‌ను లాంచ్ చేశారు. జంధ్యాల, ఈవీవీ తరహాలో ఆద్యంతం నవ్వించే చిత్రమిదని, ఓ సెన్సిటివ్ పాయింట్‌ను జాగ్రత్తగా డీల్ చేస్తూ ఈ సినిమా తీశారని హీరో శ్రీస్కంద తెలిపారు. వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని, ప్రేక్షకులు కన్నీటి చెమ్మతో థియేటర్ల నుంచి బయటకు వస్తారని దర్శకుడు చలపతి కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## స్టైలిష్‌గా గన్ పట్టుకున్న రాధ్య..

### – చరిత్ర సృష్టిస్తుందంట




రవికుమార్ సీరపు కథ, స్క్రీన్‌ప్లే అందించడంతోపాటు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్' (ంష్ట్రవ =వస దీుష్ర్త). టాలీవుడ్ విలన్, హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రంలో పాపులర్ నటి రాశీ కీలక పాత్ర పోషిస్తుంది. రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ప్రసాద్ బెహరా ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో పోషిస్తున్న రాధ్య పోస్టర్‌ను రిలీజ్ చేశారని తెలిసిందే. స్టైలిష్, మోడ్రన్ డ్రెస్‌లో ఉన్న రాధ్య ఓ చేతిలో గన్ పెట్టుకోగా.. మరో చేతిలో హ్యాండ్ బ్యాగ్ లాంటి వస్తువును చూడొచ్చు. ఆమె రూల్స్ ఫాలో అయ్యేందుకు లేదు.. చరిత్ర సృష్టించడానికి ఉంది.. అంటూ రిలీజ్ చేసిన లుక్ ది రెడ్ బ్యాగ్ ఎలాంటి ట్విస్టులు, మలుపులతో ఉండబోతుందో సస్పెన్స్ పెడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. కొన్ని పాత్రలు కేవలం కథకు సపోర్ట్‌గా నిలుస్తాయి. కానీ సావిత్రి మాత్రం మొత్తం ఆటనే మార్చేస్తుంది.. అంటూ రాశీ పాత్రను పరిచయం చేశారని తెలిసిందే. మరోవైపు మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ది రెడ్ బ్యాగ్ మూవీ ప్రీ లుక‌లో నలుగురు అమ్మాయిలతో రిలీజ్ చేసిన పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో సాగే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో, యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెప్పాడు డైరెక్టర్. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్‌బ్యాగులో ఏముంది.. అనేది టీజర్‌తో ఏమైనా హింట్ ఇస్తారేమో చూడాలి.

# నేను ఇప్పటివరకు చేయని పాత్ర ఇది

### 'పెద్ది' గురించి రామ్ చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తాజా చిత్రం 'పెద్ది'లోని పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో తాను పోషించిన పాత్ర తన కెరీర్‌లోనే పూర్తి భిన్నమైనదని ఆయన తెలిపారు. ఈ సినిమాతో నటుడిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వెల్లడించారు. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా బాలీవుడ్ మీడియాతో చరణ్ మాట్లాడారు. "పెద్ది సినిమాలో నేను చేసిన పాత్ర నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయలేదు. ఇది పూర్తిగా భిన్నమైనది. ఈ సినిమాలో చాలా మంది గొప్ప నటులతో కలిసి పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం దొరికింది" అని రామ్ చరణ్ వివరించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటన అద్భుతంగా ఉంటుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ, రామ్ చరణ్ గురించి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో చరణ్ మూడు రకాల క్రీడలు (కుస్తీ, క్రికెట్, రన్నింగ్) ప్రదర్శించారని, నాలుగో 'ఆట'గా డ్యాన్స్‌తో అదరగొట్టారని తెలిపారు. గుర్తింపు కోసం ఒక వ్యక్తి ఎంత దూరమైనా వెళ్లగలడని ఈ సినిమా నిరూపిస్తుందని బొమన్ ఇరానీ అన్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో నటిస్తుండగా, సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఈ వ్యాఖ్యలు అంచనాలను మరింత పెంచుతున్నాయి.

# చెన్నైలో జరిగే ప్రేమకథ



కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సాయిరాజేష్ కథనందిస్తున్నారు. ఈ సినిమాను జూలైలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. చెన్నై నగరం నేపథ్యంలో జరిగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ప్రేమలోని సున్నిత భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ అందరినీ మెప్పిస్తుందని, సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ చెప్పారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిస్తున్న లవ్‌స్టోరీ ఇదని, కిరణ్ అబ్బవరం పాత్ర నవ్యరీతిలో సాగుతుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కథ: సాయిరాజేష్, నిర్మాతలు: ఎస్‌కేఎన్, సాయిరాజేష్, రచన-దర్శకత్వం: రవి నంబూరి.

## కరాటే విద్య నేటి యువతకు ఎంతో అవసరం

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ : గౌస్ ఆలం
- కరాటే గ్రేడింగ్‌లో వేములవాడ విద్యార్థుల విశేష ప్రతిభ
- 10 మందికి బ్లాక్ బెల్ట్, ముగ్గురికి బ్రౌన్ బెల్ట్
- విజేతలను అభినందించిన సీపీ గౌస్ ఆలం



కరీంనగర్ / వేములవాడ (ప్రశ్న న్యూస్) కరాటే రంగంలో వేములవాడ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. కరీంనగర్‌లోని వివేకానంద పాఠశాలలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వేములవాడకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బ్లాక్ బెల్ట్‌లు, బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు.వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు మాస్టర్ అబ్దుల్ మన్నన్ శిక్షణలో ఈ పరీక్షలకు హాజరై ప్రతిభ కనబరిచారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కె. వసంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేడింగ్‌లో 10 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ అర్హతను సాధించగా, మరో ముగ్గురు విద్యార్థులు బ్రౌన్ బెల్ట్‌కు ఎంపికయ్యారు. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థుల్లో మొహమ్మద్ అబ్దుల్ ఫర్హాన్ అబ్బాసి, పి. భాస్కర్, కె.సాయి మణిరూప్, కె. సాయి మణి హర్షిత్, ఎస్.కె. షరీన్, ఎస్.కె. తన్ హజ్, సి.హెచ్. సూర్య సుశీల్, వి. శివహిత్, వి. షిరిహాస్, జి. వివేకా శ్రీ ఉన్నారు. అలాగే పి. జానవి, పి. వర్షిత్ కుమార్, సిద్దు బ్రౌన్ బెల్ట్‌ను కైవసం చేసుకున్నారు.విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వారిని ప్రత్యేకంగా అభినందించారు. కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలు నేటి యువతకు ఎంతో అవసరమని, ఇవి శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు పుల్లూరి శ్రీనివాస్, మరిపల్లి శ్రీనివాస్, కనికరపు రాజశేఖర్, కే. రాజశేఖర్ తదితరులు పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు, బెల్టులు అందజేసి వారి ప్రతిభను కొనియాడారు.

## సీనియర్ పాత్రికేయుడిని పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సత్రం సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్ జిల్లా రమేష్‌కు ఇటీవల శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వైద్యులు సూచించిన విధంగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకుని మళ్లీ తన వృత్తి బాధ్యతల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. రమేష్ కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు. అవసరమైతే ఎలాంటి సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే రాకపై జిల్లా రమేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, చిలుక రమేష్, సాగరం వెంకటస్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 25 ఏళ్ల తర్వాత కలిసిన శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- గురు-శిష్య బంధానికి ఆదర్శంగా నిలిచిన 2000 - 2001 ఎస్సెస్సీ బ్యాచ్



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్‌లోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలకు చెందిన 2000-01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు 25 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న విద్యార్థులు తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.ఈ సందర్భంగా పాఠశాలలో గడిపిన విద్యార్థి దశ, తరగతి గదుల్లో జరిగిన సరదా సంఘటనలు, ఉపాధ్యాయుల బోధన, క్రమశిక్షణ, స్నేహబంధాలు తదితర అంశాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన తొలి బ్యాచ్‌గా నిలిచినందుకు తమకు ప్రత్యేక గౌరవం దక్కిందని పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవితాలకు బలమైన పునాది వేసిన పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాఠశాల ప్రధాన కార్యదర్శి జి. నర్సయ్య, సంయుక్త కార్యదర్శి పి. మనోహర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జి. అరవింద్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి. నర్సారెడ్డి, అలాగే ఆ సమయంలో విద్యార్థులకు తెలుగు బోధించిన ఆచార్యులు టి.గంగాధర్ లను శాలువాలు,స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరించారు.సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇంత కాలం తర్వాత కూడా తమ గురువులను గుర్తుంచుకుని సత్కరించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి సమాజంలో మంచి గుర్తింపు పొందడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమం ఆప్యాయ పలకరింపులు, అనుభవాల పంచుకోలు, జ్ఞాపికల అందజేతతో ఉత్సాహభరితంగా ముగిసింది.

# ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాదిగ ఐక్య వేదిక ప్రోత్సాహం

- 150 మంది విద్యార్థులకు ఘన సన్మానం
- మెమొంటోలు అందజేత
- విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం
- అంబేద్కర్ ఆశయాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చిన వక్తలు





భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన సుమారు 150 మంది మాదిగ విద్యార్థులను "మాదిగ ఐక్యవేదిక కమిటీ" ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సూర్జిల్ బాబు, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ పోచన్న విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యే సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. కష్టపడి చదువుకుంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ అభ్యున్నతిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి విద్యార్థి తమ ప్రతిభను నిరూపించుకోవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షుడు గడల ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంటి లతా - జేజే నర్సయ్య,చెప్పాల గణేష్, చేంగల్ సర్పంచ్ రాజు, జి. రాజేశ్వర్, టి.అశోక్, దశరథ్, చౌదరి, యోనా, రతన్, రాజేందర్, సాయిబాబా, ముత్యన్న, సుదర్శన్‌తో పాటు మాదిగ సంఘాల పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.

# మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయి.

- గోదావరి పుష్కరాలు--2027కు భారీ స్థాయిలో ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తాం.
- మహిళలకు 310 కోట్లకు పైగా జీరో టికెట్లు జారీ చేశాం త్వరలో పెద్దపల్లి బస్ డిపో ప్రారంభం.
- 93 లక్షల పనులకు శంకుస్థాపన చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- ఐటీ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు.





మంథని ( ప్రశ్ న్యూస్) మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర అభివృద్ధి పనులకు లిరాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు--2027 నిర్వహణ కోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని, కుంభమేళాను తలపించే స్థాయిలో పుష్కరాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కోట్లాది మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు బస్టాండ్లను ఆధునికీకరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ జాతరకు ఏర్పాటు చేసిన తరహాలోనే పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. గత పదేళ్లలో కొత్త బస్సుల కొనుగోలు, నియామకాలు, డిపోల ఏర్పాటు వంటి అంశాలను విస్మరించారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపట్టిందన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, డిపోల ఏర్పాటు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు దాదాపు 310 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తుండగా, బస్సులు దాదాపు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించే దిశగా బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచుతున్నామని చెప్పారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గుర్తింపు సంఘాల ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. కార్మికులు అపోహలు నమ్మవద్దని మంత్రి సూచించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మంథని బస్టాండ్‌లో రెండు అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి రూ.74 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం బస్టాండ్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, కాళేశ్వరం దేవస్థాన అభివృద్ధిలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

దశాబ్దాలుగా ప్రజల ఆకాంక్షగా ఉన్న పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటు త్వరలోనే సాకారం కానుందని, మంథని బస్టాండ్ ఆధునికీకరణతో పాటు పెద్దపల్లి బస్ డిపోను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.ఆర్టీసీ కార్మికుల ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో రవాణా శాఖ మంత్రి, ఇతర మంత్రులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి ఆర్టీసీ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ ,రీజనల్ కరీంనగర్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్.యం.ఎం మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈ. హెచ్. ఎస్. పై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

కర్రు సురేష్ రాష్ట్ర కన్వీనర్ పీఆర్టీయూ పునర్నిర్మాణ కమిటీ.



మంథని ( ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య పథకం ఈ హెచ్ ఎస్ అమలును స్వాగతిస్తున్నప్పటికీ, ఉద్యోగుల నుంచి మూల వేతనంలో 1.5 శాతం వాటా వసూలు చేయాలనే నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని పి ఆర్ టి యు టీఎస్ పునర్నిర్మాణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కర్రు సురేష్ విజ్ఞప్తి చేశారు.ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు అమలు చేయలేకపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల నగదు రహిత వైద్య సేవల పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ పథకం అమలుకు సంబంధించి పూర్తి మార్గదర్శకాలు విడుదల కాకముందే ఉద్యోగుల వేతనాల నుంచి 1.5 శాతం కోత విధించడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళనకు దారితీస్తోందన్నారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం పట్ల కూడా సమాన బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలు వసూలు చేసే ప్రీమియంల కంటే అధికంగా ఉద్యోగులపై భారం మోపడం సమంజసం కాదన్నారు. అంతేకాక, మూల వేతనం ఆధారంగా వాటా నిర్ణయించడం వల్ల ఉద్యోగుల మధ్య అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.కర్రు సురేష్ మాట్లాడుతూ, ఈ హెచ్ ఎస్ పథకానికి సంబంధించిన వైద్య సేవల పరిమితులు, ఆసుపత్రుల స్లాబులు, ప్రభుత్వ చెల్లింపుల విధానం వంటి అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే పథకం లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఉద్యోగులందరికీ సమానంగా వర్తించే విధంగా నెలవారీ స్థిరమైన వాటా విధానం అమలు చేసి, ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆ ట్రస్ట్ నిర్వహణలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భాగస్వామ్యం కల్పిస్తే పథకం మరింత పారదర్శకంగా, విజయవంతంగా అమలవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీనియర్ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని కర్రు సురేష్ వెల్లడించారుఈ హెచ్ ఎస్ పథకం అమలుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.ఉద్యోగుల వాటాగా 1.5% మూల వేతన కోతపై అభ్యంతరం. మార్గదర్శకాలు విడుదలకు ముందే కోతలు విధించడం సరైంది కాదని అభిప్రాయం.ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చల అనంతరం నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి.ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉద్యోగులను భాగస్వాములుగా చేయాలని సూచన సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దల దృష్టికి అంశాన్ని తీసుకెళ్తామని ప్రకటన.ఉద్యోగులపై అధిక ఆర్థిక భారం లేకుండా, పారదర్శకంగా, శాస్త్రీయ విధానంలో అమలు చేసినప్పుడే ఈ హెచ్ ఎస్ పథకము విజయవంతం అవుతుంది

## కార్యకర్తలకు అండగా ఉంటాం

మేడ్చల్ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )కార్యకర్తలకు అండగా ఉంటామని మేడ్చల్, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన బీ ఆర్ ఎస్ కార్యకర్తలపై బి ఆర్ ఎస్ కార్యకర్తలపై ఈ ప్రభుత్వం కేసులు పెడుతుందని కేసులకు భయపడేది లేదని, ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామని తెలిపారు. ఈ విషయంలో కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందద్దని కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అందగా ఉంటామని తెలిపారు. మేడ్చల్ పట్టణం కేఎల్ఆర్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో మేడ్చల్ ఉమ్మడి మండలం కార్యకర్తల సమావేశం జరిగింది. మాజీ గ్రంథాలయం చైర్మన్, మేడ్చల్ సర్కిల్ కార్యాలయ బిజెపి అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్

బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు చామకూర మహేందర్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి బిఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల బలిదానాలు, కెసిఆర్ దీక్షతో తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. అనంతరం పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ ప్రజల మన్నలను పొందారని తెలిపారు. అనంతరం ప్రజలకు మాయ మాటలు చెప్పి, సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండున్నర ఏళ్లలోనే ప్రజల మన్నలను కోల్పోయిందని ఘాటుగా విమర్శించారు. మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్, ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు చామకూర మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ కష్టపడి పని చేయాలని, రాబోయేది( బిఆర్ఎస్ ప్రభుత్వమేనని , కార్యకర్తలు ఎవరు ఆధర్య పడకుండా పార్టీ కోసం పని చేయాలని సూచించారు.

మాజీ గ్రంథాలయ చైర్మన్, మేడ్చల్ సర్కిల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరిని విస్మరించడం జరగదని, కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని, నేను సైతం కార్యకర్త స్థాయి నుండే వచ్చానని తెలిపారు. కష్టపడ్డ వారికి పార్టీలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు రాజ మల్లారెడ్డి, దయానంద్ యాదవ్, అక్కిడి నవీన్ రెడ్డి భాగ్యరెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, సురేష్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు తదితర నేతలు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా అరాచకాలపై

# తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం యుద్ధం

## -అనం చిన్ని వెంకటేశ్వరరావు

- బాధితులకు న్యాయ అండ.. రాష్ట్రవ్యాప్తంగా సంఘ విస్తరణకు కార్యాచరణ
- ట్రేడ్ యూనియన్ నమోదు, సభ్యత్వ విస్తరణపై దూకుడు - అక్రిడేషన్ సమస్యల పరిష్కారానికి పోరాటం
- సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపుల బాధితులకు చేయూత



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననం, అసభ్యకర పోస్టులు, తప్పుడు ప్రచారాలు, ఆన్‌లైన్ వేధింపులపై తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం కఠిన వైఖరి అవలంబించనుంది. బాధితులకు చట్టబద్ధమైన న్యాయ సహాయం అందిస్తూ అండగా నిలవాలని సంఘం నిర్ణయించింది. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేయడం, ట్రేడ్ యూనియన్ నమోదు పూర్తి చేయడం, సభ్యత్వ విస్తరణను వేగవంతం చేయడం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సికింద్రాబాద్ తార్నాకలోని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యాచరణ సమావేశానికి సంఘ అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, రాష్ట్ర కోఆర్డినేటర్లు, జిల్లా ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### సంఘ విస్తరణే లక్ష్యం..

తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిల్లో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం ను మరింత బలోపేతం చేయాలని సమావేశం నిర్ణయించింది. కొత్త కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ముమ్మరం చేయాలని తీర్మానించింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం మరింత కార్యాచరణాత్మకంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వరరావు వివరించారు.

### ట్రేడ్ యూనియన్ నమోదు వేగవంతం..

ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశం స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ విస్తరణ చేపట్టి సంఘానికి మరింత బలమైన నిర్మాణాన్ని కల్పించాలని నిర్ణయించింది. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సభ్యులు అభిప్రాయపడ్డారు.

### అక్రిడేషన్ సమస్యలపై చర్చ..

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడేషన్ సమస్యలు, వృత్తిపరమైన ఇబ్బందులు, ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం కావాల్సిన అంశాలపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయుల హక్కుల కోసం సంఘం మరింత దూకుడుగా పోరాడాలని సభ్యులు సూచించారు.

### సోషల్ మీడియా దుష్ప్రచారంపై ఉక్కుపాదం

సోషల్ మీడియా వేదికగా పెరుగుతున్న వ్యక్తిత్వ హననం, దూషణలు, అసభ్యకర పోస్టులు, తప్పుడు ఆరోపణలు, లక్ష్యిత వేధింపులపై సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దుష్ప్రచారాల వల్ల అనేక మంది మానసిక, సామాజిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేధింపులకు గురైన బాధితులకు చట్టబద్ధమైన న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం ముందుకు రావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. బాధితులకు అవసరమైన మార్గదర్శకత్వం, న్యాయ సలహాలు, సహకారం అందించాలని నిర్ణయించారు.

### సైబర్ బాధితులకు అండగా సంఘం..

సైబర్ చీటింగ్‌లు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ నేరాలకు బలైన బాధితులు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించలేని పరిస్థితుల్లో ఉన్నారని సమావేశం అభిప్రాయపడింది.
అలాంటి వారికి న్యాయపరమైన మార్గదర్శకత్వం, సహాయ సహకారాలు అందిస్తూ వారి పోరాటానికి చేయూతనివ్వాలని నిర్ణయించింది.

### న్యాయం కోసం పోరాటమే లక్ష్యం..

సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సోషల్ మీడియా మరియు సైబర్ బాధితులకు అండగా నిలవడం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్న తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రానున్న రోజుల్లో మరింత కార్యాచరణాత్మకంగా పనిచేయాలని సమావేశం తీర్మానించింది. జర్నలిస్టుల సంక్షేమం, బాధితులకు న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే సంఘం ప్రధాన లక్ష్యమని నాయకత్వం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టి రామకృష్ణ, రాష్ట్ర నాయకులు వేణుగోపాల్, సుందర్ కల్లూరి, కీర్తి సంతోష్ రాజ్, సతీష్, గంగి కృష్ణ, మమత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల్లో తెలంగాణకు నైరుతి రుతుపవనాలు!

### - రాష్ట్రంలో క్రమంగా తగ్గనున్న పగటి ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహెగాన్‌లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36–38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40–42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38–39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం

### - ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక



అమరావతి (ప్రశ్న న్యూస్) నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## కండువా మారింది.. క్యారెక్టర్ మారిందా.?

# దండే విట్టల్‌పై సిర్పూర్‌లో రాజకీయ చర్చ



**సిర్పూర్(ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన దండే విట్టల్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నప్పటికీ, ఆయన రాజకీయ వైఖరిపై సిర్పూర్ నియోజకవర్గంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. కేవలం పార్టీ కండువా మాత్రమే మారిందా.? లేక రాజకీయ సిద్ధాంతాలు, వైఖరి కూడా మారాయా.? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. దండే విట్టల్ గెలిచింది వ్యక్తిగతంగా కాకుండా బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల కష్టంతోనే అనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవిని కొనసాగిస్తూ కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం సాగించడం ఎంతవరకు నైతిక విలువలు పాటించారనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఎమ్మెల్సీ పదవికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, అధికార పార్టీతో సఖ్యతగా ఉండేందుకు కాంగ్రెస్‌లో చేరినట్లుగా కనిపిస్తోందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. పదవి కోల్పోయే పరిస్థితి లేకుండా రాజకీయంగా సురక్షితంగా ఉండటమే ప్రధాన ఉద్దేశమనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే విమర్శకులు మరో అడుగు ముందుకు వెళ్లి, "కండువా మాత్రమే కాంగ్రెస్‌ది, రాజకీయ క్యారెక్టర్ మాత్రం ఇప్పటికీ బీఆర్ఎస్‌దే" అని కొందరు కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌పై తీవ్రమైన విమర్శలు చేయకపోవడం, గత అనుబంధాలను పూర్తిగా విడిచిపెట్టలేకపోవడం వంటి అంశాలను వారు ఉదాహరణగా చూపుతున్నారు. సిర్పూర్ ప్రాంతంలో వినిపిస్తున్న మరో వాదన ఏమిటంటే, కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నప్పటికీ, ఎమ్మెల్సీ పదవి సాధించిన అసలు రాజకీయ బలం బీఆర్ఎస్ పార్టీదేనని. అందువల్ల ప్రజలు ఓటు వేసింది బీఆర్ఎస్ సిద్ధాంతాలకు, బీఆర్ఎస్ అభ్యర్థికి గానీ, పార్టీ మార్పులకు కాదని కొందరు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా ఈ అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడిన కార్యకర్తలకు అవకాశాలు దక్కకుండా, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం పెరగడం వల్ల కింది స్థాయి కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో దండే విట్టల్ రాజకీయ ప్రయాణం ఏ దిశగా సాగుతుందో, కాంగ్రెస్‌లో పూర్తిస్థాయిలో కలిసిపోతారా లేక బీఆర్ఎస్‌తో ఉన్న అనుబంధాలపై వస్తున్న విమర్శలకు సమాధానం ఇస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మరి భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ అందులోకి జంప్ అవుతారా.? ప్రస్తుత పరిస్థితులలో రాజకీయాల్లో పార్టీ మారడం సాధారణమే అయినప్పటికీ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, తాను ఏ సిద్ధాంతం కోసం పనిచేస్తున్నానో స్పష్టంగా చెప్పడం నాయకుల బాధ్యత అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## దోమలతోనే దోమల నిర్మూలన

### - వ్యాధుల నియంత్రణకు గూగుల్ సరికొత్త ప్రయోగం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వ్యాధులు వ్యాప్తి చేసే దోమల జనాభాను నియంత్రించేందుకు టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఒక వినూత్న ప్రయోగానికి సిద్ధమైంది. కాలిఫోర్నియా, ఫ్లోరిడా రాష్ట్రాల్లో రాబోయే రెండేళ్లలో సుమారు 3.2 కోట్ల ప్రత్యేక దోమలను విడుదల చేసేందుకు అమెరికా పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఈపీఏ) అనుమతి కోరింది. రసాయన పురుగుమందులపై ఆధారపడకుండా దోమల వ్యాప్తిని అరికట్టడమే ఈ ప్రయోగం యొక్క ముఖ్య ఉద్దేశం. ఆల్ఫాబెట్‌కు చెందిన 'వెరిలీ' విభాగం 'డీబగ్' అనే ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా, 'వొల్బాకియా' అనే సహజ సిద్ధమైన బ్యాక్టీరియాతో నింపిన మగ దోమలను వాతావరణంలోకి విడుదల చేస్తారు. ఈ మగ దోమలు అడవి ఆడ దోమలతో కలిసినప్పుడు, వాటి నుంచి వెలువడే గుడ్లు పొదగవు. ఫలితంగా, దోమల జనాభా క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ఇది జన్యు మార్పిడి కాదని, కేవలం సహజ పద్ధతి అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వెస్ట్ నైల్ వైరస్, డెంగ్యూ, జికా వంటి ప్రమాదకరమైన వ్యాధులను వ్యాప్తి చేసే క్యూలెక్స్ జాతి దోమలను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రయోగం చేస్తున్నారు. గతంలో కాలిఫోర్నియాలోని ఫ్రెస్నో నగరంలో ఈ పద్ధతి ద్వారా దోమల సంఖ్యను 95 శాతం తగ్గించగలిగారు. సింగపూర్‌లో ఇదే విధానంతో డెంగ్యూ కేసులను 70–77 శాతం వరకు నియంత్రించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఈపీఏ సమీక్షలో ఉంది. దీనిపై ప్రజల అభిప్రాయాలను జూన్ 5 వరకు స్వీకరిస్తారు. ఈ ప్రయోగం వల్ల పర్యావరణ సమతుల్యతపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే దానిపై కూడా అధ్యయనం చేశాకే ఈపీఏ తుది నిర్ణయం తీసుకోనుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588